
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 30 మే 2025



ట్రాక్టర్ల 'కొనుగోల్‌మాల్'పై
ఇంటెలిజెన్స్ దృష్టి!
● బీఆర్ఎస్ హయాంలో అక్రమాలపై ఫిర్యాదులు
● నివేదికలు అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు 7



వరికి మద్దతు కొంతే

» పంటలకు మద్దతు ధర పెంచిన కేంద్ర ప్రభుత్వం
» వరికి రూ.69 మాత్రమే పెంపు
» పత్తికి రూ.589,కందికి రూ.550, నువ్వులకు రూ.579 పెంపు

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నెల ముందుగానే పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. ఏటా జూన్‌లో మద్దతు ధరలు ప్రకటించేది. ఈ సారి మే నెల లోనే ప్రకటించింది. ఏటా సాగు ఖర్చు పెరుగుతుండగా, కేంద్ర ప్రభుత్వం పత్తికి మినహా మిగతా పంటలన్నింటికీ గత ఏడాదితో పోల్చితే ధరలను తక్కువగా పెంచింది. పెట్టుబడి వ్యయం మాత్రం గత ఏడాదితో పోల్చితే పెరిగింది.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

గత ఏడాది వరికి రూ.117,కందికి రూ.550,నువ్వులకు రూ.632, పొద్దుతిరుగుడు రూ.520,పెసరకు రూ.124 పెంచగా,ఈఏడాది వరికిరూ.69,కందికి రూ.450,నువ్వులకు రూ.579, పొద్దుతిరుగుడుకు రూ.441, పెసరకు రూ.86 మాత్రమే పెంచింది. పత్తికి మాత్రం గత ఏడాది రూ.501 పెంచగా, ఈ ఏడాది రూ.589పెంచింది. పెట్ట పంటలకు ఆశించినస్థాయి మద్దుత ధర పెరగపోయినా, కొంత ఫరవాలేదని,వరి మద్దతు ధర పెంపులో మాత్రం అన్యాయం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి మద్దతుధర ప్రకటించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.500బోనస్ ఇస్తోంది.

ఉమ్మడి జిల్లాలో వరి సాగే ఎక్కువ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి అధికంగా సాగవుతోంది. కంది, వేరుశనగ, తదితర పంటలు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. నువ్వులు, పెసలు, పొద్దుతిరుగుడు, మినుములు లాంటి పంటలు నామమాత్రంగా సాగవుతాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీజన్‌కు సుమారు 12.66లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. సాగునీటి వనరులు అందుబాటులో లేనిప్రాంతాల్లో వానాకాలంలో సన్న రకాలు పండించేది 25 శాతమే. మిగతాదంతా దొడ్డు రకమే. ఆయకట్టు ప్రాంతాల్లో మాత్రం అధికంగా సన్నాలు సాగవుతుంటాయి.

పెరిగిన సాగు ఖర్చులు

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సాగు ఖర్చులు పెరిగాయి.

మిగతా 7వ పేజీలో...

వరి సాగుకు ఎకరాకు అయ్యే ఖర్చు

దున్నకం, గొర్రు తోలడం	7,000
విత్తనాలు 45కిలోలు	2,000
ఒరాలు తీసిపెట్టడం	1,000
నాటు కూళ్లు	6,000
కలుపు మందు	500
కలుపు తీత కూళ్లు	1,600
2 డీఏపీ సంచులు	2,700
2 యూరియా	600
గుళికలు	800
సస్యరక్షణ మందులు	1,200
కూళ్లు	1,000
వరి కోత	2,000
ధాన్యం ఆరబోత, తూర్పార బట్టడం	3,000
ధాన్యం మార్కెట్‌కు రవాణా	500
ఎకరాకు కౌలు	10,000
రైతు/పాలేరు నిర్వహణ ఖర్చు	5,000
మొత్తం	44,900

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరో వారం పదిరోజుల్లో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ) కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఈ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు చేరవేయడంలో ఈ కమిటీలు కీలక భూమిక పోషిస్తాయి. ఈ కమిటీల ఏర్పాట్లుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



» రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రణాళికలు
» ఒక్కో నియోజకవర్గ కమిటీలో 30మందికి చోటు
» జిల్లా స్థాయి కమిటీలో 40మంది నామినేట్
» కమిటీలో రైతులతో పాటు అధికారులు
» వారం పది రోజుల్లో కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

ఇక ఆత్మ కమిటీలు

ఆత్మ కమిటీలో మొత్తం 30 మంది సభ్యులు ఉంటారు. 25మంది రైతులకు, మరో ఐదుగురు అధికారులకు ఇందులో చోటు కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రైతులకు ఈ కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తారు. ఆత్మ కమిటీల్లో వ్యవసాయ అధికారులతో పాటు పశుసంవర్ధక, ఉద్యాన, హార్టికల్చర్, సెరీకల్చర్, శాస్త్రవేత్తలకు చోటుకల్పిస్తారు. స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి కోసం కొన్నేళ్ల క్రితమే అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ)ను ఏర్పాటు చేశారు. అయితే గత ప్రభుత్వ హయం నుంచి ఆత్మకు నిధులు కేటాయించకపోవడంతో అది అచేతన స్థితిలో పడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆత్మను బలోపేతం చేసేందుకు నిర్ణయించింది. వ్యవసాయశాఖతో పాటు అనుబంధశాఖలతో ఈ కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో ఆత్మ కార్యాలయం ద్వారా వ్యవసాయ సంబంధిత సాంకేతిక కార్యకలాపాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ అభివృద్ధికి సంబంధించి విభాగాలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలతో అనుబంధాన్ని ఉంచి వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయనున్నారు. ప్రధానంగా వ్యవసాయశాఖ కీలక భూమిక పోషిస్తూ పశుసంవర్ధకం, ఉద్యాన, మత్స్య పరిశ్రమ వంటి కీలక శాఖల నుంచి ఆత్మలో సభ్యులుగా చేర్చనున్నారు.

రైతుల సంక్షేమం కోసం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమం కోసం ఆత్మ కమిటీలు ఏర్పాటుచేయనుంది. వ్యవసాయరంగ అభివృద్ధితో పాటు రైతుల ఆర్థికాభివృద్ధి చెందేందుకు ఈ కమిటీ ప్రణాళికలు రూపొందిస్తుంది. మార్కెటింగ్, సాంకేతికాభివృద్ధి, ఉత్పత్తులను పెంచడం, వ్యవసాయ ఉత్పత్తులకు మరింత ఊతమిచ్చేలా ఈ కమిటీలు విధివిధానాల్లో పాల్గొంటాయి. వీటి ద్వారా రైతులను బలోపేతం చేస్తూ వారికి అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తరువాత రైతులకు సహాయ సహకరంగా ఉంటూ వారి ఇబ్బందులను, సమస్యలను పరిష్కరిస్తూ ఈ కమిటీలు ముందుకు సాగుతాయి. సీజన్ ప్రారంభం నాటి నుంచి వ్యవసాయ దిగుబడుల వచ్చి మార్కెటింగ్ అయ్యే వరకు ఈ కమిటీలు పనిచేస్తాయి. ఆత్మ అనే సంస్థ ఇతర విభాగాల సహకారంతో కమిటీలను బలోపేతం చేసి ఆ కమిటీలకు కీలక బాధ్యతలను అప్పగిస్తారు. ప్రతి కమిటీలో 30మంది సభ్యులు ఉండగా అందులో 25మంది రైతులే ఉంటుండటంతో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పరిష్కరించుకునేందుకు రైతులకువీలుంటుందనేది ప్రభుత్వ

మిగతా 7వ పేజీలో...

రోజువారీ కార్యకలాపాల పరిశీలన

ఆత్మ కమిటీలు వ్యవసాయరంగానికి సంబంధించిన కార్యకలాపాలను రోజువారీగా పరిశీలించడంతో పాటు ప్రణాళికలను అమలు చేస్తుంది. బ్లాక్, జిల్లా స్థాయిలో రైతు సలహా కమిటీలు అంటే ఆత్మ కమిటీలు ఏర్పడుతాయి. బ్లాక్ ఫార్మర్స్ సలహా కమిటీలు ఏర్పాటు చేసిన తరువాత రైతులకు ఈ కమిటీలు ఉపయోగపడుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కమిటీల్లో ఆదర్శ రైతులతో పాటు అవార్డు గ్రహీతలైన రైతులు, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో శిక్షణ పొందిన రైతులను ఈ కమిటీల్లో నామినేట్ చేస్తారు. ఈ కమిటీల్లో మూడింట ఒకరు మహిళ రైతులతో పాటు ఎస్సీ ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం కల్పిస్తారు. ఈ కమిటీలు రెండు సంవత్సరాల పాటు పనిచేస్తాయి. ప్రతీ మూడు నెలలకొకసారి కమిటీలు వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించడంతో పాటు రైతులతో సమావేశాలు నిర్వహిస్తాయి. జిల్లా స్థాయిలో ఏర్పడే కమిటీలో 40మంది సభ్యులను నియమిస్తారు. వ్యవసాయ, అనుబంధరంగాల నుంచి సంబంధిత విభాగాల్లో అనుభవజ్ఞులైన వారిని జిల్లా కమిటీతో పాటు రాష్ట్ర కమిటీకి నామినేట్ చేస్తారు.

రైతులు నూతన పద్ధతులను పాటించాలి



యాద్గార్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మిర్యాలగూడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో నూతన శాస్త్రీయ సాంకేతిక పద్ధతులను పాటించాలని కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 'ప్రయోగశాల నుంచి భూమికి' అనే నినాదంతో గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి, కొత్తపేట గ్రామాల్లో రైతుల ముంగిటకు శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు వానాకాలంలో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, భూసార పరీక్షలు, డ్రోన్ వినియోగం, నేరుగా విత్తే పద్దతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పట్టు విభాగ శాస్త్రవేత్త టి.మాధురి మాట్లాడుతూ, రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పట్టుపరిశ్రమపై కూడా మొగ్గు చూపాలన్నారు. శాస్త్రవేత్తలు జీఆర్.రామకృష్ణమూర్తి, బి.నిర్మల మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరితోపాటు కూరగాయల సాగు, పండ్ల మొక్కల పెంపకం, పెరటికోళ్లు, పశువులు, చేపల పెంపకం ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తక్కువ ఖర్చుతో లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త యామిని, ఏఈవోలు రమేష్, హిమబిందు, సైదులు, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, మహబూబ్‌అలీ, ఎల్లయ్య, రంగయ్య, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రపంచస్థాయి విద్య అందిచాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసిందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. గురువారం, ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు త్వరలో టెండర్లు పిలిచి భవన నిర్మాణ పనులను కొలిముంతలపహాడ్‌లో 25 ఎకరాల్లో చేపడతామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో రూ.50కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గానికి మిషన్‌భగీరథ ద్వారా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.140కోట్లతో ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి 132/33కేవీ, 33/11కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని 200 పడకలుగా మారుస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోందన్నారు. నేరేడుగొమ్ము మండలంలో చేపట్టిన అంభ భవాని ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు జూన్ నాటికి పూర్తవుతాయన్నారు. ఏకేబీఆర్ ఎత్తిపోతల నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, ఆలంపల్లి నర్సింహ, ఎం.సిరాజ్‌ఖాన్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, మారేపాకల సురేష్‌గౌడ్, పున్న వెంకటేశ్వర్లు, రమావత్ తుల్చానాయక్, రాంసింగ్, ఏర్పుల గోవిందు, శిరందాసు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఉడుతలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు రూరల్, మర్రిగూడ, నాంపల్లి, నల్లగొండ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉడుతలపల్లి, మర్రిగూడ మండలంలోని కొట్టాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఉడుతపల్లిలో 65 మందికి ఇళ్లు మంజూరు కాగా, 18 మంది నిర్మాణ పనులు ప్రారంభించగా, 11 మంది పునాది పనులు పూర్తిచేశారని, వారిలో ఇద్దరికి రూ.లక్ష చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేశామని కలెక్టర్‌కు ఎంపీడీవో యాదగిరి వివరించారు. కొట్టాలలో 11మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేపట్టారని కలెక్టర్‌కు ఎంపీడీవో మున్నయ్య వివరించారు. దీంతో కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున మిగిలిన లబ్ధిదారులు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి అవకతవకలను సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్లు కిరణ్మయి, శ్రీనివాస్, మర్రిగూడ మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీవో రవికుమార్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, నాయకులు ఏర్పుల శ్రీశైలం, కొట్టం కవిత యాదయ్య, లింగారెడ్డి పాల్గొన్నారు.

భవిత కేంద్రం పనులు వేగవంతం చేయాలి

మానసిక దివ్యాంగుల కోసం రీహాబిలిటేషన్ సెంటర్ భవిత కేంద్రం నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నాంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రం పనులను ఆమె తనిఖీ చేశారు. భవిత కేంద్రాల్లో ర్యాంప్, టాయిలెట్స్, యాక్టివిటీ రూమ్, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మర్రిగూడ జిల్లా పరిషత్ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసేందుకు హౌసింగ్ ఏఈతో చర్చించి ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్లు శ్రీనివాస్, దేవ్‌సింగ్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో 22 భవిత కేంద్రాలకు సివిల్ పనులు ప్రారంభించేందుకు అడ్వాన్సు సైతం మంజూరైందన్నారు. ఎంఎస్‌వోలు, ఐఆర్పీలు వ్యక్తిగత శ్రద్ధ వహించి పనులు పూర్తి చేయాలన్నారు. కేంద్రాన్ని పరికరాలతో పాటు, రంగులతో తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవిత కేంద్రాల్లో వినియోగించనున్న సామగ్రి, ఆట వస్తువులు, కుర్చీలు, బొమ్మలు, టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, నల్లగొండ, దేవరకొండ ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, డీఈవో భిక్షపతి, మండల ప్రత్యేక అధికారులు, ఎంఈవోలు, ఐఆర్పీలు పాల్గొన్నారు.


నేడు మంత్రుల సమీక్షా సమావేశం

నల్లగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి ధాన్యం సేకరణ, వ్యవసాయం, రుతుపవనాలు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి తదితర అంశాలను సమీక్షిస్తారని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నకిలీ విత్తన విక్రయాలపై నిరంతర నిఘా

జేడీఏ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని, పోలీస్‌శాఖ సమన్వయంతో నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్టు జేడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక రైతువేదికలో ఎరువుల డీలర్లతో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ఎరువుల విక్రయాలు సాగించాలని, విత్తన డీలర్లు సైతం నాణ్యమైన, మేలిరకం విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురుగుమందుల విక్రయాల్లో మోసాలకు పాల్పడితే లైసెన్స్ రద్దుచేసి కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన డీలర్లనుంచి విధిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఎరువుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సాంకేతిక పరమైన మార్పులు అందుబాట్లోకి వస్తున్నట్లు తెలిపారు. ఎరువుల కృత్రిమ కొర త సృష్టిస్తే ఉపేక్షించబోమన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా, అందులో యూరియా 30వేల మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 28వేల మెట్రిక్‌టన్నులు, డీఏపీ 4వేల మెట్రిక్‌టన్నులు, పొటాష్ 2వేల మెట్రిక్‌టన్నుల మేర నిల్వలు ఉంచామన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఎరువులను దిగుమతి చేసుకొని రైతులకు సరిపడా అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. గత వానాకాలం సీజన్‌లో జిల్లా రైతాంగం సుమారు 70వేల మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగించడం జరిగిందని, అదేస్థాయిలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, ఏవోలు రుషేంద్రమణి, సరిత, శివరామ్‌కుమార్, కిషోర్‌నాయక్, ఏఈవోలు నితిన్, షఫీ, శ్రీకాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలి

మాడ్గులపల్లి: రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని జేడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ షాపును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో శివరాంప్రసాద్, వల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని పోషిస్తున్న బీజేపీ

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించడమే తప్ప ప్రజల సమస్యలు బీజేపీ ప్రభుత్వానికి పట్టవని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సింగారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం రంగారెడ్డి-పాలమూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా, ఆంధ్రాలో కొత్త భనకచర్ల ప్రాజెక్టు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయడం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం సహకరించడం లేదని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గం కమ్యూనిస్టు కార్యకర్తలు అసమాన త్యాగాలతో ముందుకువెళ్తున్నారన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ మారుతున్న పరిస్థితి ఉందన్నారు. కానీ, ఎర్రజెండాను పట్టిన ప్రతీ నిరుపేద కార్యకర్తలు పార్టీలు మారకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిజాయితీగా పనిచేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవాలన్నారు. తొలుత అమరజీవి జినుకుంట్ల సాయిలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి అమరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. సమావేశం మండల కార్యవర్గ సభ్యుడు ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగిన నాయకులు కురుమిద్ది శ్రీనివాసులు, గురుజ రామచంద్రం, బులుగురి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, సురిగి చలపతి, బొమ్మరగోని లాలయ్య, చాపల శ్రీను, గోస్కొండ లింగయ్య, మందుల పాండు, బండమీది యాదయ్య, దుబ్బ వెంకన్న, ఈదులకంటి కైలాస్, వనం వెంకన్న, ఎండి.జానీ, బులుగూరి వంశీకృష్ణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రానున్న నలుగురు కొత్త ఐఏఎస్‌లు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): 'సివిల్ సర్వీసెస్ పరీక్ష-2024' ద్వారా ఎంపికైన నలుగురు కొత్త ఐఏఎస్ అధికారులు రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి మొత్తం 180 మంది ఐఏఎస్‌లను ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) వెల్లడించింది. రాష్ట్రానికి రానున్న నలుగురిలో ఇద్దరు సొంత రాష్ట్రం తెలంగాణకు చెందిన వారు కాగా... మిగతా ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపింది. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందినవారు కాగా, మరో ఇద్దరు ఇతర వెనుకబడిన వర్గాల(ఓబీసీ)కు చెందినవారు ఉంటారని డీవోపీటీ పేర్కొంది.

విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి

» అధిష్ఠానానికి విజ్ఞప్తి చేయనున్న ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఆ వర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు మందుల సామ్యూల్, కవ్వంపల్లి సత్యానారాయణ, అడ్లూరి లక్ష్మణ్, తోట లక్ష్మికాంతరావు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు చెప్పాలని ఢిల్లీకి వచ్చామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 60 లక్షలు వరకు ఉన్న తమకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని చెప్పారు.

మంత్రిపై అసభ్య పోస్టు .. బీఆర్ఎస్ నేత అరెస్ట్

కాటారం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుపై సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టిన కాటారం బీఆర్ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉన్న శ్రావణ్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు శ్రావణ్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు బెయిల్ మంజూరు చేసిందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

» భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఇందులో ఆర్థిక ఇబ్బందుల కారణంగా 60 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిసిన తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

రేపే మిస్ వరల్డ్-2025 ఫైనల్

హైటెక్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా వేదిక .. మల్టీ మీడియా చాలెంజ్‌లో విజేతలుగా నలుగురు

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రపంచ అందాల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం మిస్ వరల్డ్-2025 ఫైనల్ కోసం నగరం సిద్ధమైంది. సాయంత్రం 6 గంటల నుంచి హైటెక్స్‌లో జరగనున్న ఈ పోటీల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక డిజైనర్లు ప్రధాన వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శనివారం వేడుకల్లో భాగంగా.. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండేజ్, ఇషాన్ ఖట్టర్‌తో పాటు పలువురు నటులు నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ఫైనల్ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నటుడు సోనూ సూద్, మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి, 2017 మిస్ వరల్డ్ విజేత మానుషి చిల్లర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా.. ఏటా మిస్ వరల్డ్ ఫైనల్లో ఇచ్చే మానవతావాది (హ్యూమానిటేరియన్) పురస్కారాన్ని ఈసారి సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. అలాగే రెండు రోజుల క్రితం నిర్వహించిన 'మల్టీమీడియా చాలెంజ్' విజేతలను మిస్ వరల్డ్ సంస్థ గురువారం రాత్రి ప్రకటించింది. ఇందులో నాలుగు ఖండాల నుంచి నలుగురు విజేతలున్నారు. ఏషియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్, యూరప్ నుంచి మాంటెనెగ్రో, ఆఫ్రికా నుంచి కామెరూన్, అమెరికా-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు ఇందులో విజేతలుగా నిలిచారు. దీంతో ఫైనల్‌లో టాప్-40లో వీరి స్థానం ఖరారైంది.



'మల్టీమీడియా చాలెంజ్' విజేతలు మిస్ థాయ్‌లాండ్, మిస్ కామెరూన్, మిస్ డొమినికన్ రిపబ్లిక్, మిస్ మాంటెనెగ్రో

'మిస్ వరల్డ్'కు రూ.300 కోట్లా..?

» మహిళా హక్కుల ఉద్యమకారుల ధ్వజం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర పైసల్లేవ్.. కానీ, మిస్ వరల్డ్ అందాల పోటీలకు మాత్రం రూ.300 కోట్లు ఖర్చుపెడతారా?'అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మహిళా హక్కుల ఉద్యమకారులు మండిపడ్డారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీకి ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. శనివారం జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పదోవంతు డిగ్రీ కాలేజీల్లో సున్నా ప్రవేశాలు

ఒక్కరూ చేరని కాలేజీలు 74 .. 60,436 మందికి ప్రవేశాలు ఖరారు..దోస్త్ తొలి విడత జాబితా విడుదల



హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన దోస్త్-2025 తొలి విడత అడ్మిషన్లలో రాష్ట్రంలోని 805 కాలేజీల్లో 74 కాలేజీల్లో ఒక్కరూ అడ్మిషన్‌కు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. అందులో రాజన్న-సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా ఉంది. గతేడాది మాదిరే ఈసారి యూజీ డిగ్రీలో 36శాతం (21,758 మంది) కామర్స్ కోర్సులు ఎంచుకోగా, తర్వాతి స్థానాల్లో ఫిజికల్ సైన్సెస్ 15,249 మంది, లైఫ్ సైన్సెస్ 11,005 మంది, ఆర్ట్స్ 5,986 మంది, ఇతర కోర్సులు 6,438 మంది ఎంచుకున్నారు. 58,575 మంది ఇంగ్లీష్ మాధ్యమం, 1,552 మంది తెలుగు, 309 మంది హిందీ మాధ్యమం ఎంచుకున్నారు. తొలి జాబితాలో సీట్లు విద్యార్థినులే అధికసీట్లు పొందారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో 89,572 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 65,191 మంది వెబ్ ఆప్షన్లు సమర్పించారు. వారిలో 60,436 మంది సీట్లు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 805 డిగ్రీ కాలేజీల్లో 3,71,096 సీట్లు ఉన్నాయి. దోస్త్ తొలి విడుత అడ్మిషన్ల జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఈ.పురుషోత్తం, ఎస్‌కె. మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు గురువారం విడుదల చేశారు. తొలి జాబితాలో సీట్లు లభించిన వారు ఈ నెల 30 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ నిర్దిష్ట ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేకపోతే సీటు రద్దవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి జూన్ 9వరకూ దోస్త్ రెండో విడత దరఖాస్తులను స్వీకరిస్తామని, 13న సీట్లు కేటాయిస్తామన్నారు.

సీట్ల భర్తీలో నిజాం కాలేజీ టాప్

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ 1,197 సీట్లకు 1,170 (97.74%) సీట్ల భర్తీతో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కోఠి మహిళా కాలేజీ (వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం)లో 93.19%, మూడో స్థానంలో ఉన్న సిటీ కాలేజీలో 88.89, బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 82.69, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 80.98, నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం డిగ్రీ కాలేజీలో 80.29, కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కాలేజీలో 73.01, నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కాలేజీలో 68.56, హన్మకొండలోని యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో 66.1, నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీలో 65.75% సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి దోస్త్‌లో 10 మంది టాప్ ర్యాంకర్లలో నలుగురు కోఠి మహిళా కాలేజీని ఎంచుకున్నారు. వారిలో ముగ్గురు ఫిజికల్ సైన్సెస్, ఒకరు లైఫ్ సైన్స్ సబ్జెక్ట్ ఆప్ట్ చేసుకున్నారు. ఇంటర్‌లో 99.60% మార్కులతో దోస్త్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు పొందిన వసంత్ కుమార్, 99.40% మార్కులతో ఎనిమిదో ర్యాంకు పొందిన బెక్కరి అక్షిత కూడా నిజాం కాలేజీలో కామర్స్ విభాగంలో సీటు పొందారు.

75% హాజరుతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్

డిగ్రీ కోర్సుల్లో కనీసం 75% తరగతులకు హాజరైన విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని గురువారం జరిగిన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మరోవైపు, మూడేళ్ల డిగ్రీ కోర్సుల్లో ఆరు సెమిస్టర్లలో ప్రతి సెమిస్టర్‌కు 25 క్రెడిట్స్ చొప్పున 150 క్రెడిట్స్ ఉండగా, వాటిని 142కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చివరి సంవత్సరం రెండు సెమిస్టర్లలో ఒక మైనర్ సబ్జెక్ట్, ప్రథమ/ద్వితీయభాషలకు కలిపి 15 చొప్పున 30 క్రెడిట్స్ తొలగించారు. ఐదో సెమిస్టర్‌లో మల్టీ డిసిప్లినరీ కోర్సు 4, అదనంగా నేర్చుకునే ఇతర కోర్సులకు 7 క్రెడిట్స్, చివరి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌కు 4, ఇతర అదనపు కోర్సులకు 7 క్రెడిట్స్ కేటాయించారు. చివరి రెండు సెమిస్టర్లలో విద్యార్థులు రెండు ప్రధాన సబ్జెక్టులపై దృష్టి సారించాలని, ఇంటర్న్‌షిప్‌తోపాటు అదనపు కోర్సులు నేర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్త క్రెడిట్స్ విధానం రూపొందించామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి దూకి బీఆర్ఎస్ నేత ఆత్మహత్య

మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ వేధింపుల వల్లేనంటూ బంధువుల ఆందోళన

బోరబండ ప్రాంతంలో ఉద్రిక్తత



ఎండీ సర్దార్ (ఫైల్)

బోరబండ, మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులే సర్దార్ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. దీనితో బోరబండ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎండీ సర్దార్ ఎస్ఆర్‌టీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి తన ఇంటి నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్, ఆయన భార్య హబీబాషేక్, పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

● అసాంఘికశక్తుల ఆటకట్టించేందుకే కార్డెన్‌సెర్చ్ ● మిర్యాలగూడలో 118 వాహనాలు సీజ్ ● నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్





వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చిత్రంలో స్వాధీనం చేసుకున్న వాహనాలు

మిర్యాలగూడ అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి విక్రయాలను సమూలంగా నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలను అమలు చేస్తున్నామని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో గురువారం తెల్లవారుజామున డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఒక నార్కోటిక్ డాగ్‌తోపాటు ఐదుగురు సీఐలు, 20మంది ఎస్ఐలు, 280 మంది పోలీస్‌సిబ్బంది పాల్గొనగా, తనిఖీలను ఎస్పీ పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, గంజాయి విక్రయాలకు పాల్పడ్డా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత గంజాయి, గుట్కా, మద్యం మత్తుకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్ లక్ష్యం కోసం కష్టపడాలని సూచించారు. శివారుకాలనీల్లో అసాంఘిక శక్తుల ఆటకట్టించి శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కాలనీలో జరిపిన తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 118 వాహనాలను గుర్తించామన్నారు. అందులో 98 ద్విచక్ర వాహనాలు, 16 ఆటోలు, మూడు కార్లు, ఒక ట్రాక్టర్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీటితోపాటు అక్రమంగా నిల్వ ఉంచిన 220 మద్యంబాటిళ్లను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఫింగర్ ప్రింట్ డివైజర్ సహాయంతో పాతనేరస్తులను గుర్తించడంతోపాటు ముగ్గురు రౌడీషీటర్లు, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాలనీలో 50 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చిందని, వీరంతా ఎక్కడనుంచి గంజాయి తెచ్చుకొని సేవించారన్న దానిపై విచారిస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తున్నట్లుగా కనిపిస్తే 100కు ఫోన్‌చేసి సమాచారమివ్వాలని ప్రజలను కోరారు. సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు మోతీరాం, సోమనర్సయ్య, పీఎన్డీ ప్రసాద్, జనార్దన్‌గౌడ్, శ్రీనునాయక్‌కరుణాకర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారులపై కేసు నమోదు

మోత్కూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మోత్కూరులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న వార్తలు గుప్పుమంటున్నాయి. మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో వాహనాల తనిఖీలో ముగ్గురు యువకులు గంజాయితో పోలీసులకు పట్టుబడటంతో ఈ వార్తలకు బలం చేకూరుతున్నది. బుధవారం సాయంత్రం మోత్కూరు-నార్కట్‌పల్లి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయితో పట్టుబడిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ప్రొబెషనరీ ఎస్ఐ నోయల్ రాజు, కానిస్టేబుళ్లు హుస్సేన్, మహేష్, శ్రీనివాస్, ఖదీర్ బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై ఉన్న నలుగురు యువకులు మోత్కూరు చెందిన కోల దినేష్, జనగామ జిల్లా కొడకండ్ల మండలం పాకాల గ్రామానికి చెందిన బుర్క సాయి, గుండాల మండల గంగాపురం గ్రామానికి చెందిన ఆవుల భరత్, బొంత రాము అనే యువకుల వద్ద 90 గ్రాముల గంజాయి దొరికింది. వెంటనే పోలీసులు గంజాయిని, బైక్‌లను స్వాధీనం చేసుకుని యువకులను అదుపులోకి తీసుకుంటుండగా బొంత రాము తప్పించుకుని పరారయ్యాడు. అతనికోసం గాలిస్తున్నట్టు చెప్పారు. మోత్కూరులో గంజాయికి అలవాటుపడటంతోపాటు విక్రయాలు కూడా జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంజాయి తాగినా, అమ్మినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. గంజాయికి అలవాటు పడి యువత వారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

పశువుల వాహనం పట్టివేత

మునగాల, మే 29(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని జాతీయ రహదారి మొద్దుల చెరువు స్టేజీ సమీపంలో కబేళాకు తరలిస్తున్న పశువుల వాహనాన్ని గురువారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాలు తనిఖీ చేస్తుండంగా కోదాడ నుంచి హైదరాబాద్‌కు ట్రాలీ వాహనంలో ఎనిమిది పశువులను కబేళాకు తరలిస్తున్నట్లు గమనించామన్నారు. కోదాడకు చెందిన మొయినుద్దీన్, డ్రైవర్ అనిల్ పై కేసు నమోదు చేసి, పశువులను హైదరాబాద్ జియాగూడ గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేటక్రైం, మే 29, (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో ఒకరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.సాయిరాం గురువారం తెలిపారు. ఈ నెల 28వ తేదీన సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఐదుగురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తెలిపారు. వారిని గురువారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు పర్చగా సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒకరోజు జైలుశిక్షతో పాటు రెండు వేల జరిమానా, మరో నలుగురికి కలిపి రూ.3500 జరిమానా విధించినట్లు తెలిపారు.

గంజాయి సాగుచేస్తున్న నలుగురి అరెస్టు

● సుమారు 3లక్షల విలువైన 30గంజాయి మొక్కలు సాగు



గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుచేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని దుగ్యాల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో దేవరకొండ ఏఎస్పీ మౌనిక వివరాలు వెల్లడించారు. పెద్దఅడిశర్లపల్లి మండలం పిల్లిగుండ్లతండాకు చెందిన ఇస్లావత్ చందు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన డేరంగుల సింగరావు కొండమల్లేపల్లిలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరిద్దరూ కలిసి పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామ శివారులో నాగిళ్ల పాండరయ్య అనే రైతు ఆరు ఎకరాల భూమిని ఆరు నెలల క్రితం కౌలుకు తీసుకున్నారు. ఆ ఆరు ఎకరాల్లో బత్తాయి, మామిడి తోటలు ఉండగా, కొంత భూమిలో వరి సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా డేరంగుల సింగరావుకు నాంపల్లి మండలం బండతిమ్మాపురం గ్రామానికి చెందిన కొత్తగొల్ల శ్రీనుతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో శ్రీను కొన్ని గంజాయి విత్తనాలు డేరంగుల సింగరావుకు ఇచ్చి పెంచమన్నాడు. తోటల మధ్యలో వేస్తే ఎవరికీ తెలియదని సూచించారు. అంతేగాక పెంచినందుకు డబ్బులు కూడా ఇస్తానని చెప్పడంతో అంగీకరించాడు. సింగరావు ఆ విత్తనాలను చందు తీసుకువచ్చి ఇచ్చి వీటిని పండిస్తే డబ్బులు వస్తాయని చెప్పాడు. దీంతో ఇరువురు కలిసి కౌలు తీసుకున్న తోటలో విత్తనాలు నాటారు. అవి మొక్కలుగా మారడంతో సింగరావు శ్రీనుకు ఇచ్చాడు. దీంతో శ్రీను సింగరావుకు రూ.5వేలు ఇవ్వగా అందులో నుంచి రూ.2వేలు చందుకు ఇచ్చాడు. శ్రీను ఆ గంజాయి మొక్కలు తీసుకుని నాంపల్లి మండలం రేవల్లి గ్రామానికి చెందిన వంగూరి శివతో కలిసి తన దగ్గరకు వచ్చే వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. మరల శ్రీను గంజాయి విత్తనాలను సింగరావుకు ఇవ్వగా ఆ తోటలో నాటడంతో 30 మొక్కలు పెరిగాయి. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు వారు సేద్యం చేస్తున్న వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి గంజాయిని సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం కౌలుకు తీసుకున్న ఇస్లావత్ చందు, డేరంగుల సింగరావును అదుపులోకి తీసుకొని విచారించగా, కొత్తగొల్ల శ్రీను, వంగూరి శివ గురించి వివరాలు వెల్లడించారు. నలుగురిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వివరించారు. చాకచక్యంగా గంజాయి నిందితులను పట్టుకున్న కొండమల్లేపల్లి ఇన్‌చార్జి సీఐ, నాంపల్లి సీఐ డి.రాజు, గుడిపల్లి ఎస్ఐ డి.నర్సింహులు, కొండమల్లేపల్లి ఎస్ఐ ఏ.రమేష్, కానిస్టేబుళ్లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఏఎస్పీ మౌనిక అభినందించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. మేళ్లచెర్వు, తిరుమలగిరి, మాడ్గులపల్లి, రామన్నపేట మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున దుర్మరణం చెందారు.

మేళ్లచెర్వు, మే 29(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని కందిబండ శివారులో జరిగింది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన సయ్యద్ నాగుల్‌మీరా (50) బుధవారం రాత్రి మండల పరిధిలోని కందిబండ గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే నాగుల్‌మీరాను బంధువులు కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడని, అతని భార్య రహీనా భేగం తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ పల్టీ కొట్టి..

తిరుమలగిరి రూరల్: ట్రాక్టర్ పల్టీ కొట్టి యువకుడు మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భూతం భాషి(30) మధ్యాహ్నం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌తో వెళ్తుండగా బోడ గుట్ట సమీపంలో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న భాషి అక్కడికక్కడే మృతి చెందాడు. భాషికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



తొండ గ్రామంలో మృతి చెందిన భాషి

మాడ్గులపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన బొప్పని సుధాకర్(42) ఆర్టీసీ కండక్టర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 7న సాయంత్రం తోపుచర్ల నుంచి కుక్కడానికి బైక్‌పై బయలుదేరాడు. కుక్కడం శివారులోకి రాగానే బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. సుధాకర్ భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సుదాకర్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

రామన్నపేట: విద్యుదాఘాతంతో గృహిణి మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని కురుమవాడలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం కురుమవాడకు చెందిన జూకంటి అనిత (30) రోజు మాదిరిగానే గురువారం ఉదయం తన ఇంట్లో నీటి సంపుకు ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మిర్యాలగూడ తమిళనాడు మెర్కంటైల్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాస్ రెడ్డి తన ద్విచక్రవాహనంపై మేళ్లచెర్వు మండలం గుడిమల్కాపురం గ్రామంలో బ్యాంకు ఫీల్డ్ వర్క్ పూర్తి చేసుకొని తిరిగి మిర్యాలగూడ వెళుతున్నాడు. మిర్యాలగూడ, కోదాడ ప్రధాన రహదారిపై మార్గంమధ్యలోని గరిడేపల్లి మండల కేంద్రంలోని మసీద్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి, ట్రక్కుకు తగలడంతో స్కూటీపై నుంచి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా, కొద్ది రోజుల క్రితం బదిలీపై మిర్యాలగూడ వచ్చినట్లు తెలుస్తుంది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తిప్పర్తి, మాడ్గులపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండల పరిధిలోని శిలార్‌మియాగూడేనికి చెందిన రాయి సైదులు చిన్న కుమారుడు మహేందర్(21) ఇంటర్ పూర్తి చేసి మిర్యాలగూడెంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన మహేందర్ కుక్కడం, తిప్పర్తి మధ్యలో గుంటూరు నుంచి నల్లగొండ వైపునకు వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. తన కుమారుడు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకొని ఉంటాడని మహేందర్ తండ్రి తెలిపారు. గత కొన్ని నెలలుగా యువకుడు లోన్ యాప్స్ బారిన పడి ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

కొనుగోలు చేశారా? కిడ్నాప్‌లు చేశారా?


సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో శిశు విక్రయాల కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

- శిశువుల తల్లిదండ్రులు ఎవరు?
- శిశు విక్రయాల కేసులో ఈ కోణంలో దర్యాప్తు
- లక్షల్లో దండుకున్న మధ్యవర్తులు

సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో కొందరు అక్రమ మార్గాలను ఎంచుకున్నారు. అందులో భాగంగా కొందరు పిల్లలు లేని వారిని గుర్తించి వారికి అప్పుడే పుట్టిన, రోజుల వయస్సు ఉన్న శిశువులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సొమ్ము పోయినా తమకు పిల్లలు ఉన్నారనే సంతోషం పిల్లలులేని వారికి కలిగితే, నిందితులు అక్రమంగా డబ్బు సంపాదించారు. శిశువులను ఎక్కడి నుండి తెచ్చారు? ఏవిధంగా తెచ్చారు? శిశువులను కిడ్నాప్ చేశారా? తల్లిదండ్రులు పోషించలేక దళారులకు విక్రయించారా? శిశువుల తల్లిదండ్రులు ఎవరు? మిగిలిన శిశువులు ఎక్కడ ఉన్నారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట క్రైం)

డబ్బు సంపాదనే లక్ష్యంగా కొంత మంది ముఠాగా ఏర్పడి శిశు విక్రయాలకు పాల్పడ్డారు. లక్షల్లో డబ్బు దండుకుంటున్నారు. ఆ డబ్బును ముఠా సభ్యులందరూ పంచుకుంటున్నారు. అసలు శిశువులను ఇచ్చిన వారికి మాత్రం వేలల్లోనే అందినట్లు సమాచారం. శిశు విక్రయాలకు పాల్పడే ముఠా సభ్యులు కొంత కాలంగా వివిధ రాష్ట్రాల్లో 28 మంది పిల్లలను విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. సూర్యాపేట పోలీసులు 10 మంది చిన్నారులను సంరక్షించగా ఇంకా 18 మంది చిన్నారులను సంరక్షించాల్సి ఉంది. ఈ శిశువుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

శిశువుల తల్లిదండ్రులు ఎవరు?

శిశు విక్రయాల కేసులో శిశువుల తల్లిదండ్రులు ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని వివిధ పట్టణాల్లో నుంచి శిశువులను తెచ్చి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విక్రయించినట్లు ఇటీవల పట్టుబడిన నిందితులు అంగీకరించారు. అయితే శిశువుల తల్లిదండ్రులు ఎవరు? శిశువు లను కిడ్నాప్ చేశారా? శిశువులను తల్లిదండ్రులే విక్రయించారా? ఎందుకు విక్రయించారు? అనే విషయాలు తెలియాల్సి ఉంది.

మిగిలిన శిశువుల కోసం పోలీసుల వేట

శిశు విక్రయాల ముఠా సభ్యులు మొత్తం 28 మందిని వివిధ ప్రాంతాల్లో విక్రయించినట్లు అంగీకరించారు. పోలీసులు ఇప్పటి వరకు 10మంది చిన్నారులను సంరక్షించారు. మిగిలిన 18 మంది శిశువుల ఆచూకీ కోసం పోలీసుల వేట కొనసాగిస్తున్నారు.

కిడ్నాప్ కేసులపై అధికారుల దృష్టి

తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో శిశువులు కిడ్నాప్‌లు అయిన కేసుల వివరాలను సూర్యాపేట పోలీసులు అధికారులు సేకరిస్తున్నారు.
గతంలో శిశువులు కిడ్నాప్‌నకు గురైన సమయంలో వారి తల్లిదండ్రుల ఫిర్యాదులను కాపీలను పరిశీలించాలని నిర్ణయించారు. ఈ ఫిర్యాదుల ప్రతులను తెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కిడ్నాప్ కేసుల నమోదుకు, తాము సంరక్షించిన శిశువుల ఆధారాలతో పోలికలు కలుస్తున్నాయా? అని సూర్యాపేట పోలీసులు సరిచూస్తున్నారు. శిశువుల పోలికలు సరిపోతే నిబంధనల మేరకు ఆ శిశువులను కన్నవారికి అప్పగించే ఆలోచనలో ఉన్నారు.

కొనుగోలు చేశారా? కిడ్నాప్‌లు చేశారా? అనే కోణంలో విచారణ

శిశువుల విక్రయాల ముఠా సభ్యులు శిశువులను వారి తల్లిదండ్రుల వద్ద నుంచి కొనుగోలు చేసి తెచ్చి విక్రయించారా? కిడ్నాప్‌లు చేసి తెచ్చారా? అనే విషయాలు కూడా బహిర్గతం కావాల్సి ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి శిశువులను తెచ్చిన ముఠా సభ్యులు విక్రయించే సమయాల్లో కొంతమందిని శిశువుల తల్లిదండ్రులను ఏర్పాటు చేసి, వారే నిజమైన తల్లిదండ్రులను నమ్మించినట్లు సమాచారం. దీంతో శిశువులను ఆస్పత్రులు, ఇళ్ల నుంచి ఎత్తుకు వచ్చారనే అనే అనుమానాలు ఉన్నందున, పోలీసులు ఈ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేస్తాం



శిశు విక్రయాల కేసులో నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చాం. కోర్టు అనుమతితో నిందితులను కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేస్తాంయి. విక్రయించిన శిశువుల వివరాలు తెలుసుకుని సంరక్షిస్తాం. ఈ కేసులో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందో గుర్తించి అరెస్టు చేస్తాం. విక్రయించిన శిశువులను వారి తల్లిదండ్రుల నుంచి కొనుగోలు చేశారా? కిడ్నాప్ చేసి తెచ్చారా? అనే విషయాలు కూడా రాబడతాం. పిల్లలు లేని వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుని శిశువులను దత్తత తీసుకోవాలి.
- కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ, సూర్యాపేట

భక్తుల మనోభావాలు, ఆలయ భద్రతే ముఖ్యం

● బాధ్యులపై కఠిన చర్యలు : ఈవో వెంకట్రావు


విలేకరులతో మాట్లాడుతున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, వారితో పాటు ఆలయ భద్రతే ముఖ్యమని దేవాదాయ శాఖ కమిషనర్, యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు అన్నారు. యాదగిరికొండపై తన కార్యాలయంలో గురువారం చింతపండు దొంగతనంపై అధికారులతో సమీక్షించి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో జరిగిన చింతపండు దొంగతనంపై విచారణకు ఐదుగురితో కమిటీ నియమించినట్లు ఆయన చెప్పారు. దొంగతనం ఇప్పుడు జరిగిందా? లేక గతంలో జరిగిందా? అనే అంశాలపై కమిటీ విచారిస్తోందన్నారు. ఆలయ చరిత్రలో యాదగిరీశుడి చెంత దొంగతనం జరగడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటన విషయం ఉన్నతాధికారుల దృష్టి తీసుకువెళ్లినట్లు వివరించారు. సంఘటనలో ఆలయ అధికారులు, భద్రత అధికారుల ప్రమేయం ఉంటే చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే పట్టుబడిన ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కేసు నమోదు అయ్యిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు, ఆలయ ఆస్తులు కాపాడేందుకు భద్రత సిబ్బంది, హోంగార్డుల సంఖ్య పెంచి దేవస్థానానికి సంబంధించిన గోదాంల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ప్రసాదాల తయారీ కేంద్రం బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు షోకాజు నోటీసులు జారీ చేశామన్నారు. ఆలయంలో అవసరమైన సిబ్బందిని కూడా పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

సాయినాథ ఆలయంలో గురుదత్త హోమం


హోమం నిర్వహిస్తున్న స్వామీజీలు

చింతపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం గురుదత్త హోమం భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ కార్యక్రమాలను ముక్కామల పిఠాధిపతి శ్రీధర్‌స్వామిజీ, చండీఉపాసకులు కొడకండ్ల రాంచరణ్‌శర్మ, శానగొండ శివకిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీధర్‌స్వామి మాట్లాడుతూ ...సమాజంలోని ప్రతి ఒక్కరికీ చింతపల్లిలో కొలువుదీరిన సాయినాథుని దర్శించుకోవడం ద్వారా జీవితం ఎంతో సాఫీగా సాగుతుందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరూ సహకరించాలన్నారు. ఆలయ కమిటీ 320 గోవులను పెంచి హైందవ ధర్మ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. భక్తిభావంతో ముక్తిమార్గం లభిస్తుందన్నారు. ఈ వార్షికోత్సవాలకు నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, సంగారెడ్డి, సాగర్, మాచర్ల, పిడుగురాళ్ల, సూర్యాపేటకు చెందిన భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు కోలాట ప్రదర్శనతో అందరిని అకట్టుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం పుల్లారెడ్డి, సభ్యులు తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

● వివరాలు వెల్లడించి డీఎస్పీ రాజశేఖర్‌రాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లను టార్గెట్‌చేసి స్వైపింగ్ మిషన్ల ద్వారా ఆర్థికనేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు గురువారం అరెస్టుచేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంచరిస్తూ క్రెడిట్‌కార్డుతో నగదు కాజేస్తున్న నిందితుడి వివరాలను డీఎస్పీ రాజశేఖర్‌రాజు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఏపీ రాష్ట్రం పల్నాడుజిల్లా, నర్సరావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన అనాల శివ అనే యువకుడు తన ద్విచక్రవాహనంపై సంచరిస్తాడ. వాహనాల రద్దీ అధికంగా ఉన్న పెట్రోల్‌బంక్‌లను ఎంచుకొని అత్యసరంగా డబ్బు కావాలని పంపు ఆపరేటర్లకు కమీషన్ ఆశ చూపి పీవోఎస్ యంత్రం సాయంతో నగదు డ్రా చేస్తాడు. అనంతరం పంపు ఆపరేటర్లు బిజీగా ఉండటాన్ని గమనించి పీవోఎస్ యంత్రంలోని వైడ్‌సేల్ ఆప్షన్‌ను ఎంచుకొని మోసాలకు పాల్పడుతన్నట్లు డీఎస్పీ తెలిపారు. పెట్రోల్ బంకులో నగదు లావాదేవీలకు ఉపయోగించిన పీవోఎస్ యంత్రంలో లావాదేవీల ఐడీని ఎంచుకొని అందులోని వైడ్‌సేల్ రిటర్న్ ఆప్షన్‌ను సక్సెస్ చేసి డ్రా చేసిన నగదును తిరిగి తన ఏటీఎం, క్రెడిట్ కార్డు ఖాతాల్లో జమ చేసుకుంటాడని డీఎస్పీ తెలిపారు. ఇదే తరహాలో ఈనెల 11న నాగార్జునసాగర్ హైవే పక్కనగల భారత్‌పెట్రోల్ బంక్‌లోకి వెళ్లిన నిందితుడు అనాల శివ తన వద్ద ఉన్న కర్నాటకబ్యాంక్ ఏటీఎం కార్డు ద్వారా పంపు అపరేటర్‌నుంచి తొలుత రూ.35,350 తీసుకొని, రెండోసారి రూ.30,250 డ్రా చేశాడు. పంపు ఆపరేటర్ బిజీగా ఉండడాన్ని గమనించి స్వైపింగ్ మిషన్‌లోని ఆప్షన్లను ఉపయోగించి తాను డ్రా చేసిన రూ.65,600లను తిరిగి తన ఖాతాలో జమ చేసుకుని వెళ్లాడు. సేల్స్ లెక్కలో తేడా రావడంతో బొమ్మిరెడ్డి బ్రహ్మారెడ్డి అనుమానించి బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీయించడంతో 11వ తేదీన రెండు విడతల్లో డెబిట్‌కార్డు ద్వారా డ్రా చేసిన నగదు తిరిగి అదే ఖాతాలో రిటర్న్ జమైనట్లు తేలింది. దీంతో పంపు ఆపరేటర్ బ్రహ్మారెడ్డి విజయపురి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బ్యాంకు స్టేట్‌మెంట్, డెబిట్‌కార్డు వివరాల ఆధారంగా విచారణ చేపట్టగా నిందితుడి ఆచూకీ తెలిసిందని డీఎస్పీ తెలిపారు. కాగా గురువారం విజయపురి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి నాగార్జునసాగర్ బార్డర్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు అనాల శివ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరాలు చేసినట్లు అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు.

నిందితుడిపై తెలుగు రాష్ట్రాల్లో కేసులు

నిందితుడు శివపై విజయపురి పోలీస్ స్టేషన్‌తోపాటు సూర్యాపేట జిల్లాలోని మునగాల, సూర్యాపేట రూరల్, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, గుంటూరు జిల్లా మేడికొండూరు, జీకొండూరు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాగా, బాపట్ల, విజయవాడ, పెడన, గుడివాడ, నాగులపాడు, ఒంగోలు, వినుకొండ, యడ్లపాడు, చౌడవరం, పురిచెడు, దర్శి, పిడుగురాళ్ల, తెనాలి, కందుకూరు, పొదిలి, గిద్దలూరు పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో నేరం అంగీకరించాడు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో చేసిన నేరాలను అంగీకరించడంతో నిందితుడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపారు. తెలుగు రాష్ట్రాల్లో సంచరిస్తూ నేరాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న విజయపురి సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ సంపత్‌లను డీఎస్పీ అభినందించారు.

ఇక 'ఆత్మ' కమిటీలు

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నాయి. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో వచ్చే వారం పది రోజుల్లోపు ఈ కమిటీలు ఏర్పడనున్నాయి. వ్యవసాయరంగంలో ఉత్సాహవంతులైన రైతులకు, అనుభవజ్ఞులకు చోటు కల్పించి రైతులకు అండగా ఉండేలా కమిటీలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో వీటికి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం బీఎఫ్ఏసీ (బ్లాక్ రైతుల సలహా కమిటీ)గా నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేస్తుండగా, జిల్లా స్థాయిలో డీఎఫ్ఏసీ (జిల్లా రైతుల సలహా కమిటీ)గా ఏర్పాటు కానున్నాయి. రైతులు, అధికారుల భాగస్వామ్యం తో ఏర్పాటు అవుతున్న ఈ కమిటీలు కీలక భూమిక పోషించనున్నాయి. గతంలో వ్యవసాయరంగంలో రాణించిన వారితో పాటు ప్రస్తుతం వ్యవసాయంపై మక్కువతో పనిచేస్తున్న వారికి చోటు కల్పించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

రైతుల సంక్షేమం కోసం ..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆత్మ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. బ్లాక్ (నియోజకవర్గం), జిల్లా స్థాయిలో ఏర్పడే కమిటీలతో రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. చిన్న, సన్నకారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మహిళ రైతులకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులకు ఈ కమిటీల్లో చోటు ఉంటుంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభు త్వం ఈ కమిటీలను ఏర్పాటు చేయడంతో, రైతులకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు సులభంగా అందనున్నాయి. అదేవిధంగా రైతులు పండిం చే ఉత్పత్తులకు, ఇతర సమస్యల పరిష్కారానికి కమిటీలు పనిచేస్తాయి.
-పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ,నల్లగొండ

మావోయిస్టులతో చర్చలు జరుపాలి

తుర్కపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి) :కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ కోరారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వంద సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య, నాయకులు గుజ్జుక మహిపాల్, వల్లపు బగవంత్, నాగారం అంజయ్య బండారు రాజు, నర్సింహులు, సత్తయ్య, కుమార్ పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

చౌటుప్పల్ రూరల్, మే29(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు , ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఎం.సుజాత, డాక్టర్ కె.వాణిశ్రీలు, వ్యవసాయ రంగంలో చేపట్టవల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్ , వ్యవసాయ విస్తరణ అధికారి శంకరయ్య, ఉద్యాన వన శాఖ అధికారి హరీశ్ పాల్గొన్నారు.

అహల్యాబాయి జయంతి

భూదాన్‌పోచంపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): లోకమాత రాణి అహల్యాబాయి జయంతిని పురస్కరించుకుని గురువారం భూదాన్‌పోచంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యాబాయి వీరత్వాన్ని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కన్వీనర్ ఉమాశంకర్, మాధురిచంద్ర, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సాయేష్, నాయకులు చిక్క కృష్ణ, బస్వలింగం పాల్గొన్నారు.

కొను'గోల్‌మాల్'పై ఇంటెలిజెన్స్ దృష్టి

- గత ప్రభుత్వ హయాంలో అక్రమాలపై ఫిర్యాదులు
- జిల్లా పంచాయతీ అధికారి నుంచి నివేదికలు ఆదేశాలు



నల్లగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్ల కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ ఆరా తీయడంతోపాటు జిల్లా పంచాయతీ అధికారిని నివేదిక ఇవ్వాలంటూ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 1,582 గ్రామపంచాయతీల్లో 70శాతంవరకు మూడు కంపెనీలకు చెందిన ట్రాక్టర్లనే కొనుగోలుచేశారు. ఆయా కంపెనీల నుంచి ట్రాక్టర్ల కొనుగోలుకు ఎక్కువ ధరకు కొటేషన్లను సేకరించి తక్కువ ధరకు ట్రాక్టర్లను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారినట్లు తెలియడంతో విచారణ చేపడుతున్నట్లు వినికిడి.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి, స్వచ్ఛపల్లె, హరితహారం ఇతర పనులకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంచాయతీలకు ట్రాక్టర్లను కొనుగోలుచేశారు. గత ప్రభుత్వ హయాంలో భారీగా అవతవకలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు చర్చ సాగుతుంది. ఇప్పటికే పంచాయతీ అధికారులకు సైతం నోటీసులు జారీ చేయడంతోపాటు ట్రాక్టర్ల కొనుగోలుపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 2019నుంచి 2022వరకు ఐదు విడతలుగా పల్లె ప్రగతిపై కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ట్రాక్టర్ కొనుగోలుకు సంబంధించి అప్పటి ప్రజాప్రతినిధులు సూచించిన మేరకు ఆయా కంపెనీల ట్రాక్టర్లు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

ఉమ్మడి జిల్లాలో కొనుగోలు

నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో 2019-22 మధ్య కాలంలో ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. అయితే ట్రాక్టర్ల కొనుగోలుకు సంబంధించి అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా పంచాయతీలకు ప్రొసిడింగ్స్ ఇస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఇందులో మినీ, మేజర్ గ్రామపంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ట్రాక్టర్ ఇంజన్‌ను కొనుగోలు చేసినందుకు టెండర్లను ఆహ్వానించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14 నుంచి 15 టెండర్లు దాఖలు చేయగా కేవలం మూడు కంపెనీల నుంచే కొనుగోలుచేశారు. వీరంతా సిండికేట్‌గా మారి ఒకే రేటుకు కోడ్ చేసిన ప్రొసిడింగ్ ఇచ్చారు. ఇకపోతే అప్పటి సర్పంచ్‌లు ఉన్నతాధికారుల ప్రొసిడింగ్ మేరకు గ్రామపంచాయతీకి వచ్చిన నిధులతో జనాభా ప్రకారం అందుకు తగిన సామర్థ్యం ఉన్న ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. అదేవిధంగా ట్రాలీలు, ట్యాంకర్లలో కూడా అక్రమాలు జరిగాయి. ట్రాలీలు, ట్యాంకర్లు సరఫరా చేసిన ఇంజనీరింగ్ వర్క్స్ కాంట్రాక్టర్లు అవతవకలకు పాల్పడినట్లు సమాచారం. ట్రాక్టర్ ఇంజన్‌కు సంబంధించి ఒక్కొక్క ట్రాక్టర్ రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు వెచ్చించినట్లు తెలిసింది. అదేవిధంగా ట్రాలీలు, ట్యాంకర్లను రూ.1.20లక్షల నుంచి రూ.1.80లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇకపోతే ట్రాలీలు, ట్యాంకర్లు తయారీకోసం ఓ ఇంజనీర్ వర్క్స్ కంపెనీకి అత్యధికంగా ఆర్డర్‌లు ఇంచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై నల్లగొండ డీపీవో వెంకయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నివేదిక ఇవ్వాలంటూ తనకు ఎలాంటి ఆదేశాలు అందలేదని పేర్కొన్నారు.

యాదగిరీశుడికి నిత్య పూజలు

యాదగిరిగుట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో గురువారం అత్యంత వైభవంగా నిత్య పూజలు నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి గజవాహన సేవలో తీర్చిదిద్దారు. వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు కప్పి ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాత వేళ గర్భాలయంలో స్వామి అమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొపిన అర్చకులు నిజాభిషేకం, నిత్య అర్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ జరిగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 40,31,493 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.


యాదగిరిగుట్టలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


మఠంపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తి శ్రద్ధలతో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మేళ్లచెర్వు: మఠంపల్లి లక్ష్మీనర్సింహస్వామి మహా క్షేత్రంలో భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణోత్సవాన్ని అర్చకులు నిర్వహించారు. మొదట స్వామి వారి నిజరూప అభిషేకాల అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, స్వామి వారికి మహానీరాజనం మంత్రపుష్పం సమర్పించి, కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభచార్యులు, లక్ష్మీనర్సింహామూర్తి, నవీన్, శ్రీధర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వరికి మద్దతు కొంతే

(5వ పేజీ తరువాయి)



విత్తనాలు, ట్రాక్టర్ దున్నకం, ఫ్లౌవేయడం, కూలి రేట్లు పెరిగాయి. వ్యవసాయ పంపు సెట్లు, ట్రాక్టర్ లాంటి వ్యవసాయ యంత్రాల రేట్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. సాగు ఖర్చు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం పెంచే మద్దతు ధరలు పెట్టుబడి ఖర్చుల పెరుగుదలతో సరిపోలడం లేదని రైతులు వాపోతున్నారు. వరి సాగుచేస్తే ఎకరాకు సగటున 22 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేస్తే మద్దతు ధర లభిస్తుంది. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తే క్వింటా రూ.2,000లకే కొనుగోలుచేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడే చేతికి వచ్చే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వరం సంస్థలు మద్దతు ధరకు కొనుగోలుచేస్తే రూ.52,118 వస్తుంది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం రైతు ఖర్చుకు 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలి. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం ఎకరాకు రైతు పెట్టుబడి ఖర్చు రూ.44,900, దానికి 50శాతం రూ.22,450 కలిపితే మొత్తం రూ.67,350 ఆదాయం వచ్చేలా ధర నిర్ణయించాలి. ఆ ధర రావాలంటే క్వింటాకు రూ.3,000 మద్దతు ధర ప్రకటించాలి. కనీసం క్వింటాకు రూ.2,700 మద్దతు ధర ప్రకటిస్తే బాగుంటుందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి వరికి ధర పెంచాలని రైతులు కోరుతున్నారు.

పంటలకు మద్దతు ధర పెంపు ఇలా..

పంటరకం	2022	2023	పెంపు	2024	పెంపు	2025	పెంపు
వరి (సాధారణం)	2,040	2,183	143	2,300	117	2,369	69
వరి (ఏ-గ్రేడ్)	2,060	2,203	143	2,320	117	2,389	69
పత్తి (మధ్యస్థపింజ)	6,080	6,620	540	7,121	501	7,710	589
పత్తి (పొడువుపింజ)	6,380	7,020	640	7,521	501	8,110	589
కంది	6,600	7,000	400	7,550	550	8,000	450
పెసర	7,755	8,558	803	8,682	124	8,768	86
మినుములు	6,600	6,950	350	7,400	450	7,800	400
జొన్న (హైబ్రీడ్)	2,970	3,180	210	3,371	191	3,699	328
జొన్న (మాల్దండి)	2,990	3,225	235	3,421	196	3,749	328
సజ్జ	2,350	2,500	150	2,625	125	2,775	150
రాగులు	3,578	3,846	268	4,290	444	4,886	596
మొక్కజొన్న	1,962	2,090	128	2,225	135	2,400	175
వేరుశనగ	5,850	6,377	527	6,783	406	7,263	480
పొద్దుతిరుగుడు	6,400	6,760	360	7,280	520	7,721	441
సోయాబీన్	4,300	4,600	300	4,892	292	5,328	436
నువ్వులు	7,830	8,635	805	9,267	632	9,846	579

మద్దతు ధర ప్రకటించే ముందు రైతు సంఘాలతో చర్చించాలి



కేంద్ర ప్రభుత్వం ఏటా పంటలకు మద్దతు ధర పెంచుతున్నా రైతులకు గిట్టుబాటు కావడం లేదు. పంట సాగుకు అయ్యే ఖర్చుకు 50శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని స్వామినాథన్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కేంద్రం ప్రభుత్వం వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. కేంద్రం మద్దతు ధరలు ప్రకటించే ముందు రైతులు లేదా రైతు సంఘాల నాయకులతో చర్చించి గిట్టుబాటు అయ్యేలా మద్దతు ధరలు ప్రకటించాలి. లేనిపక్షంలో వ్యవసాయం కుంటుపడుతుంది.
-యానాల దామోధర్‌రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు



శాలిగౌరారం, మే 29 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ఏపీవోగా బత్తుల వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. దామరచర్ల ఎంపీవోగా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాలిగౌరారం ఎంపీవోగా పనిచేసిన అల్లూరి పద్మ మార్చిలో పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి నార్కట్‌పల్లి ఎంపీవోగా ఉన్న బానోతు సుధాకర్ శాలిగౌరారం ఇన్‌చార్జి ఎంపీవోగా పనిచేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

కనగల్, మే 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటదని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పగిడిమర్రి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు అద్దంకి లింగయ్య, పగిడిమర్రి రాము వివిధ కారణాలతో మృతి చెందారు. ఆయా కుటుంబాలకు మంత్రి వెంకట్‌రెడ్డి పంపిన రూ.10వేల ఆర్థికసాయం మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డితో కలి సి ఆయన అందజేశారు. మృతుల చిత్రపటాలకు వేసి నివాళులర్పించారు.

హైదరాబాద్‌కు సెమీ డీలక్స్ సర్వీసు లేవీ!


నార్కట్‌పల్లిలో ప్రయాణికుల రద్దీ

- అయితే ఎక్స్‌ప్రెస్... లేదంటే పల్లెవెలుగులేనా
- రద్దీతో రోజూ నిలబడే వెళ్తున్నామంటున్న ప్రయాణికులు
- నార్కట్‌పల్లి బస్టేషన్ నుంచి లేని సెమీ డీలక్స్
- సర్వీసుల సంఖ్యను పెంచాలని ప్రయాణికుల విజ్ఞప్తి

నార్కట్‌పల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కలిగించిన తర్వాత తర్వాత ఆర్టీసీ బస్సుల్లో రద్దీ కనపడుతోంది. ఆర్టీసీ చరిత్రలోనే రికార్డులు బ్రేక్ అయ్యేలా ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) నమోదైన తీరు ఇందుకు నిదర్శనం. సీటింగ్ సామర్థ్యం 55కి మించి అదనంగా మరో 35 నుంచి 40 మందితో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి నడుస్తున్నాయి. కానీ బస్సుల్లో మహిళల ఆక్యుపెన్సీ రేషియోనే 80 శాతం వరకు ఉంటున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తర్వాత బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల సంఖ్య అమాంతం పెరిగింది. మరీ ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల్లో ఏ ఒక్కటీ ఖాళీగా వెళ్తున్న దాఖలాలు కనబడటం లేదు. ఓఆర్‌కు తగినట్లుగా బస్సుల సంఖ్య లేకపోవడంతో కిక్కిరిసి పోక తప్పని పరిస్థితి. అయితే ఈ ప్రభావం కొందరు రోజూ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులపై తీవ్రంగా పడుతోంది. తాము ప్రయాణ చార్జీలు చెల్లించి ప్రతీరోజూ నిలబడి పోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది.

ఆధార్ చెల్లకుండా...

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత బస్సుల్లో అమాంతం పెరిగిన రద్దీ పరిస్థితులను స్వయంగా చూసిన ఆర్‌టీసీ అధికారులు సెమీ డీలక్స్ బస్సులను కొన్ని ప్రాంతాలకు నడుపుతున్నారు. లిమిటెడ్ స్టాపుల్లోనే నిలిపేలా ఈ సర్వీసులను ప్రవేశపెట్టారు. బస్సు చార్జీలు చెల్లించైనా ప్రయాణించే వారిని దృష్టిలో పెట్టుకుని వారి సౌలభ్యం కోసమే ఈ సెమీ డీలక్స్ సర్వీసులను ఆర్టీసీ అధికారులు తీసుకువచ్చారు. ఎక్స్‌ప్రెస్‌కు ఎక్కువ డీలక్స్‌కు తక్కువగా ఉండే ఈ బస్సుల్లో ఆధార్ కార్డును ఉపయోగించి ఉచిత ప్రయాణం చేయడం కుదరదు.

సెమీ డీలక్స్ సర్వీసులు లేవు

నార్కట్‌పల్లి బస్టేషన్ నుంచి సెమీ డీలక్స్ సర్వీసుల సౌకర్యం హైద్రాబాద్ వైపునకు లేకపోవడం గమనార్హం. బస్‌స్టేషన్ పరిధిలో కామినేని మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, ఎంజీ యూనివర్సిటీ, చెర్వుగట్టు ప్రధాన దేవాలయం నార్కట్‌పల్లి బస్‌స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి. హైదరాబాద్‌కు వెళ్లే భక్తులు, ఉద్యోగుల రాకపోకలు ఈ బస్‌స్టేషన్ నుంచే చేయాల్సి ఉంది. కానీ అయితే ఎక్స్‌ప్రెస్ లేదా పల్లె వెలుగుబస్సులు మాత్రమే ఉన్నాయి. ఈ బస్సుల్లో రద్దీతో కొందరు ప్రతీరోజూ హైదరాబాద్‌కు ప్రయాణించే వారు బస్సుల్లో సీటు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. పోనీ చార్జీలు చెల్లించైనా కూర్చొని వెళదామనుకుంటే సెమీ డీలక్స్ బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. కానీ కేవలం సూర్యాపేట డిపోకు చెందిన 3 సర్వీసులు మాత్రమే అదీ గడిచిన మూడు రోజులుగా నడుపుతున్నారు.

నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్‌కు 250 ట్రిప్పులు

నార్కట్‌పల్లి బస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు ఆయా డిపోల బస్సులు సుమారు 250 ట్రిప్పుల వరకు నడుస్తున్నాయి. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి, మణుగూరు డిపోలకు చెందిన వాటితో పాటు నల్లగొండ రీజియన్ పరిధిలోని నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, నార్కట్‌పల్లి డిపోలకు చెందిన బస్సులు హైదరాబాద్ సెక్టార్‌లో నడుస్తున్నాయి. సుమారు 250 ట్రిప్పుల్లో కలిసి దాదాపుగా 14,000లకు పైగా ప్రయాణికులను హైదరాబాద్ వైపునకు చేరవేస్తున్నాయి.

సెమీ డీలక్స్ సర్వీసుల సంఖ్య పెంచాలి



హైదరాబాద్‌కు వెళ్లేందుకు నార్కట్‌పల్లి బస్‌స్టేషన్ కూడలి లాంటిది.జిల్లా కేంద్రంతో పాటు పర్యాటక ప్రాంతాలు, విద్య, ఆరోగ్య, వ్యాపార, వాణిజ్య అవసరాల దృష్ట్యా హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య ఈ బస్‌స్టేషన్ నుంచి ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్న ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోనీ చార్జీలు చెల్లించి ప్రయాణించాలనుకుంటే సెమీ డీలక్స్ సర్వీసులు ఎక్కువగా లేవు. ఆర్టీసీ అధికారులు ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని నార్కట్‌పల్లి బస్‌స్టేషన్ మీదుగా హైదరాబాద్‌కు నడిచే సెమీ డీలక్స్ సర్వీసుల సంఖ్యను పెంచాలి.

\- కందగట్ల శ్రీనివాస్, నార్కట్‌పల్లి

సెమీ డీలక్స్ బస్సులు ఎక్కువగా లేవు



నల్లగొండ రీజియన్ పరిధిలో సెమీ డీలక్స్ బస్సులు ఎక్కువగా లేవు. వాటి తయారీ సంఖ్య ఎక్కువగా లేదు. ఉన్న కొన్ని సర్వీసులను హైదరాబాద్ రూట్‌లోనే సూర్యాపేట డిపో నుంచి ఆపరేట్ చేస్తున్నాం. ప్రయాణికులు కోరితే డీలక్స్ బస్సులను నడిపేందుకు ప్రయత్నిస్తాం.

\- జాన్‌రెడ్డి, ఆర్ఎం, నల్లగొండ

మండలంలో ఆధ్యాత్మిక శోభ

● శాపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

నార్కట్‌పల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాపల్లి కమలాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో నూతనంగా ప్రతిష్ఠించే నవగ్రహ విగ్రహ పూజలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ఆలయ అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యుల యాజ్ఞీకంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠ పూజల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం మూల మంత్ర హోమాలు చేశారు. సాయంత్రం నవగ్రహ విగ్రహాలకు ధాన్య, పుష్ప, శయ్యాధి వాసాలు నిర్వహించారు.

నార్కట్‌పల్లిలో గ్రామదేవతలు...

నార్కట్‌పల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పట్టణంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న గ్రామ దేవతలు ముత్యాలమ్మ, మారెమ్మ, కట్ట మైసమ్మ, కోట మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రతిష్ఠించే విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

ఈ నెల 30వ తేదీన శుక్రవారం గణపతి పూజ, స్థాపిత మంటప ఆరాధానలు, ధాన్యాధివాసం, పుష్ప, ఫల, వస్త్ర, శయ్య, దనాదివాసాలను నిర్వహించనున్నారు. అంగ, స్వర్ణ హోమాలు నిర్వహించనున్నారు. 31న శనివారం విగ్రహాల ప్రతిష్ఠ జరగనుంది. ఈ వేడుకల కోసం ఇప్పటికే నార్కట్‌పల్లిలో కోలాహలం మొదలైంది.

సమాచారం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సుధాకర్

శాలిగౌరారం, మే 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. శాలిగౌరారం మండలం బండమీదిగూడెం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేసే సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పేదల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి అంజయ్య, సిరందాసు రాజు, వీరారెడ్డి, కప్పల యాదగిరి, బుక్క రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నార్కట్‌పల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన మేడబోయిన నాగరాజు భార్య పద్మ ఇటీవల మృతి చెందింది. పద్మ కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ గురువారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని కొంత ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు గుండాల మల్లేష్‌యాదవ్, సత్యం, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ మండల అధ్యక్షుడిగా ప్రవీణ్


ప్రవీణ్‌కు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

నార్కట్‌పల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ (వీసీఐ) నార్కట్‌పల్లి పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా పల్లెర్ల ప్రవీణ్, సెక్రటరీ మంచుకంటి సంతోష్, కోశాధికారిగా గర్రె వెంకన్న ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీసీఐ జిల్లా వైస్ గవర్నర్ వీరెల్లి సతీష్, తాళ్లపల్లి రాము, నూనె కిశోర్, దేవరశెట్టి నారాయణ, బిళ్లకంటి శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొరివి శంకర్‌కు ఇంపాక్ట్ సర్టిఫికెట్



ఇంపాక్ట్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న శంకర్

కనగల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొరివి శంకర్ ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలో నెల రోజుల పాటు నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలపై శిక్షణ నిర్వహించారు. శిక్షణను పూర్తి చేసుకుని వారికి గురువారం సంస్థ ప్రతినిధి నూనె సుదర్శన్ లయన్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు మదన్‌మోహన్ ఇంపాక్ట్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సర్టిఫికెట్‌ను అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. పలువురు నాయకులు శంకర్‌కు అభినందనలు తెలిపారు.

వరికి మద్దతు ధర పెంపులో కేంద్రం వివక్ష

కేతేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): పంటల ధరల పెంపులో దక్షిణాదిలో ఎక్కువగా పండించే వరి పంటకు నామమాత్రంగా కేంద్ర ప్రభుత్వం ధరను పెంచి వివక్ష చూపిందని టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా పండే వరి క్వింటాల్‌కు కేవలం రూ.69మాత్రమే పెంచిందన్నారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు వరి క్వింటాల్‌కు రూ.28 వందలు మద్దతు ధర చెల్లిస్తేనే రైతుకు గిట్టుబాటుగా ఉంటుందన్నారు. కూలీల కొరత, పెరిగిన సాగు ఖర్చుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరి మద్దతు ధర పెంపుపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

బీవెల్లెంల రిజర్వాయర్‌లో నీళ్లున్నాయా

● ఆరా తీసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
● కోమటిరెడ్డితో కలిసి నార్కట్‌పల్లిలో ఆగిన భట్టి


నార్కట్‌పల్లిలో ఆగిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మీ నాయకుడు మంత్రి గారు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వగ్రామం బీ.వెల్లెంలలో ప్రారంభించిన ఉదయసముద్రం రిజర్వాయర్‌లో నీళ్లు ఉన్నాయా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్థానిక కాంగ్రెస్ నేతలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి గురువారం ఖమ్మం జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద కొద్దిసేపు ఆగారు. డిప్యూటీ సీఎం అయినా స్థానిక ఓ హోటల్ వద్ద సామాన్యుడిలా భట్టి కూర్చుని మంత్రి కోమటిరెడ్డితో కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు దైద రవీందర్‌తో పాటు నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తుల ఊశయ్యలను భట్టికి కోమటిరెడ్డి పరిచయం చేశారు. ఈ సందర్భంగా భట్టి వారితో మాట్లాడుతూ ఉదయసముద్రం రిజర్వాయర్ నీటిపై ఆరా తీశారు. కాల్వలు పూర్తయిన తర్వాత చెరువులకు నీటిని మళ్లిస్తున్నామని వారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి తెలిపారు.

రికార్డుల్లో లోట్లు లేకుండా చూడాలి

● జడ్పీ సీఈవో బి. శ్రీనివాసరావు


ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

చండూరు రూరల్, మే29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రికార్డులను నమోదు చేయాలని, రికార్డుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల ని జడ్పీ సీఈవో బి. శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీ వో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అ న్ని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ రి కార్డులను విధిగా నిర్వహించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండారు యాదగిరి, ఎంపీవో మాధవరెడ్డి, సూపరింటెండెంట్ నర్సింహ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


కూలీలతో మాట్లాడుతున్న మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ

నల్లగొండ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉపాధి హామీ పని ప్రదేశాలను పరిశీలించిన వారితో మాట్లాడారు. దేశవ్యాప్తంగా పేదలు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య పోరాటంతో పాటు వామపక్షాల ఒత్తిడి మేరకు యూపీఏ ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని గ్యారంటీ కోసం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈనెల 30వ తేదీన జరిగే ధర్నాకు కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి కూలీలను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కట్ట అంజయ్య, గోలి నరసింహ, పద్మ, రాజు, వెంకటమ్మ, రాములు, సరస్వతి, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ప్రతిభ చాటి రాణించాలి

● పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన కలెక్టర్


క్రీడాకారులకు పతకాలు అందజేసి అభినందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ స్పోర్ట్స్, మే 29(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు భవిష్యత్తులో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా మంచి పేరు తేవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. మంచిర్యాల పట్టణంలో మంచిర్యాల టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి టైసన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మిర్యాలగూడకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన ఎస్‌కె, పర్వాబాతల్ 49 వెయిటేజ్ కేటగిరిలో, వి. సాయిసిద్దార్థ 58 వెయిటేజ్ కేటరిగిలో బంగారు పతకాలు సాధించారు. 49 వెయిటేజ్ కేటగిరిలో ఎస్‌కె. రహమున్నీసాకు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. యోగా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన మౌనిక, రజిత, జాహ్నవికి కాంస్య పతకాలను బుధవారం హైదారాబాద్‌లో అందజేశారు. జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రసాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులతో గురువారం కలెక్టర్ త్రిపాఠిని కలిశారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు పతకాలు అందజేసి అభినందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లా మంచి పేరు తేవాలని కాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాసులు, డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ రవి, నాగార్జున, డీఎస్ఏ సిబ్బంది సురేష్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందజేయాలి


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పరశురాములు

తిప్పర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలని తహసీల్దార్ కె. పరశురాములు అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఏవో సన్ని రాజు ఆధ్వర్యంలో మండలంలోని ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ దుకాణదారుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పత్తి, వరి విత్తనాలు, ఎరువులను విక్రయించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. డీలర్లు రైతులకు సంబంధిత బిల్లు అందించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులు కూడా రశీదులు తప్పని సరిగా తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంమూర్తి, ఏఈవోలు, పలురు డీలర్ షాపు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం రావడం ఖాయం

● టీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముద్దం శ్రీనివాస్

మర్రిగూడ, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం వస్తుందని, మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాలో నిర్వహించిన తెలుగుదేశం మహానాడు కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. తెలుగుజాతిని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబెట్టే శక్తి సామర్థ్యాలు ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు మాత్రమే ఉన్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు చేరువవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల యాదయ్య, అంజయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, మల్లయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కట్టంగూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులో జూన్ 22, 23 తేదీల్లో జరిగే కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున కోరారు. కట్టంగూరు మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాజీవ్ యువవికాసం వలన దళితులకు ఒరిగింది ఏమీలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరున గురుకుల పాఠశాలలు ఎత్తివేయడం మానుకోవాలన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం అందరికీ ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంటెపాక కృష్ణ, పెంజర్ల సైదులు, రవీందర్, రవి, శ్యామ్, రామకృష్ణ, బాబురావు, రమేష్, రవీందర్, శైలజ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

జాలు కాల్వ నిర్మాణానికి ప్రతిపాదనలు


కొత్తపల్లిలో జాలుకాల్వ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఈ విక్రమ్


శాలిగౌరారం, మే 29 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల పరిధిలోని నూలగడ్డ కొత్తపల్లి గ్రామ శివారులో గల కందికుంట, గారెకుంటలకు జాలు నీరు వెళ్లడానికి కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇచ్చినట్లు నీటి పారుదల ఏఈ విక్రమ్ తెలిపారు. గురువారం ఆయన రెండు కుంటల నుంచి వచ్చే జాలు నీటిని పరిశీలించి దానికి పరిష్కారంగా జాలు కాల్వ తీయడానికి ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఏఈ విక్రమ్ తెలిపారు. పరిశీలించిన వారిలో రైతు సంఘం నాయకులు చామల వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, నాయకులు లోడంగి మహేష్, సంకటి లింగయ్య, ఒగోటి శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగేష్ చేసిన సేవలు మరువలేనివి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

గట్టుప్పల్, మే 29 (ఆంధ్రజ్యోతి): నగేష్ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు కకునూరి నగేష్ గురువారం ఉదయం తెల్లవారుజామున మరణించారు. ఆయన మృతదేహానికి సుధాకర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగేష్ కార్మికులు, కర్షకులు, ప్రజల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి కొనియాడారు. ఆయన మృతి సీపీఎం పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నగేష్ కుటుంబానికి సీపీఎం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, మాజీ సర్పంచ్ శ్రీశైలం పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 30 మే 2025



ట్రాక్టర్ల 'కొనుగోల్‌మాల్'పై ఇంటెలిజెన్స్ దృష్టి!

- బీఆర్ఎస్ హయాంలో అక్రమాలపై ఫిర్యాదులు
- నివేదికలు అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు

7



వరికి మద్దతు కొంతే

- పంటలకు మద్దతు ధర పెంచిన కేంద్ర ప్రభుత్వం
- వరికి రూ.69 మాత్రమే పెంపు
- పత్తికి రూ.589,కందికి రూ.550, నువ్వులకు రూ.579 పెంపు

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నెల ముందుగానే పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. ఏటా జూన్‌లో మద్దతు ధరలు ప్రకటించేది. ఈ సారి మే నెలలోనే ప్రకటించింది. ఏటా సాగు ఖర్చు పెరుగుతుండగా, కేంద్ర ప్రభుత్వం పత్తికి మినహా మిగతా పంటలన్నింటికీ గత ఏడాదితో పోల్చితే ధరలను తక్కువగా పెంచింది. పెట్టుబడి వ్యయం మాత్రం గత ఏడాదితో పోల్చితే పెరిగింది.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

గత ఏడాది వరికి రూ.117,కందికి రూ.550,నువ్వులకు రూ.632, పొద్దుతిరుగుడు రూ.520,పెసరకు రూ.124 పెంచగా,ఈఏడాది వరికిరూ.69,కందికి రూ.450,నువ్వులకు రూ.579, పొద్దుతిరుగుడుకు రూ.441, పెసరకు రూ.86 మాత్రమే పెంచింది. పత్తికి మాత్రం గత ఏడాది రూ.501 పెంచగా, ఈ ఏడాది రూ.589పెంచింది. పెట్ట పంటలకు ఆశించినస్థాయి మద్దుత ధర పెరగపోయినా, కొంత ఫరవాలేదని,వరి మద్దతు ధర పెంపులో మాత్రం అన్యాయం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి మద్దతుధర ప్రకటించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.500బోనస్ ఇస్తోంది.

ఉమ్మడి జిల్లాలో వరి సాగే ఎక్కువ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి అధికంగా సాగవుతోంది. కంది, వేరుశనగ, తదితర పంటలు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. నువ్వులు, పెసలు, పొద్దుతిరుగుడు, మినుములు లాంటి పంటలు నామమాత్రంగా సాగవుతాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీజన్‌కు సుమారు 12.66లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. సాగునీటి వనరులు అందుబాటులో లేనిప్రాంతాల్లో వానాకాలంలో సన్న రకాలు పండించేది 25 శాతమే. మిగతాదంతా దొడ్డు రకమే. ఆయకట్టు ప్రాంతాల్లో మాత్రం అధికంగా సన్నాలు సాగవుతుంటాయి.

పెరిగిన సాగు ఖర్చులు

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సాగు ఖర్చులు పెరిగాయి.

మిగతా 7వ పేజీలో...

వరి సాగుకు ఎకరాకు అయ్యే ఖర్చు

దున్నకం, గొర్రు తోలడం	7,000
విత్తనాలు 45కిలోలు	2,000
ఒరాలు తీసిపెట్టడం	1,000
నాటు కూళ్లు	6,000
కలుపు మందు	500
కలుపు తీత కూళ్లు	1,600
2 డీఏపీ సంచులు	2,700
2 యూరియా	600
గుళికలు	800
సస్యరక్షణ మందులు	1,200
కూళ్లు	1,000
వరి కోత	2,000
ధాన్యం ఆరబోత, తూర్పార బట్టడం	3,000
ధాన్యం మార్కెట్‌కు రవాణా	500
ఎకరాకు కౌలు	10,000
రైతు/పాలేరు నిర్వహణ ఖర్చు	5,000
మొత్తం	44,900

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరో వారం పదిరోజుల్లో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ) కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఈ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు చేరవేయడంలో ఈ కమిటీలు కీలక భూమిక పోషిస్తాయి. ఈ కమిటీల ఏర్పాట్లుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



- రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రణాళికలు
- ఒక్కో నియోజకవర్గ కమిటీలో 30మందికి చోటు
- జిల్లా స్థాయి కమిటీలో 40మంది నామినేట్
- కమిటీలో రైతులతో పాటు అధికారులు
- వారం పది రోజుల్లో కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

ఇక ఆత్మ కమిటీలు

ఆత్మ కమిటీలో మొత్తం 30 మంది సభ్యులు ఉంటారు. 25మంది రైతులకు, మరో ఐదుగురు అధికారులకు ఇందులో చోటు కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రైతులకు ఈ కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తారు. ఆత్మ కమిటీల్లో వ్యవసాయ అధికారులతో పాటు పశుసంవర్థక, ఉద్యాన, హార్టికల్చర్, సెరీకల్చర్, శాస్త్రవేత్తలకు చోటుకల్పిస్తారు. స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి కోసం కొన్నేళ్ల క్రితమే అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ)ను ఏర్పాటు చేశారు. అయితే గత ప్రభుత్వ హయం నుంచి ఆత్మకు నిధులు కేటాయించకపోవడంతో అది అచేతన స్థితిలో పడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆత్మను బలోపేతం చేసేందుకు నిర్ణయించింది. వ్యవసాయశాఖతో పాటు అనుబంధశాఖలతో ఈ కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో ఆత్మ కార్యాలయం ద్వారా వ్యవసాయ సంబంధిత సాంకేతిక కార్యకలాపాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ అభివృద్ధికి సంబంధించి విభాగాలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలతో అనుబంధాన్ని ఉంచి వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయనున్నారు. ప్రధానంగా వ్యవసాయశాఖ కీలక భూమిక పోషిస్తూ పశుసంవర్ధకం, ఉద్యాన, మత్స్య పరిశ్రమ వంటి కీలక శాఖల నుంచి ఆత్మలో సభ్యులుగా చేర్చనున్నారు.

రైతుల సంక్షేమం కోసం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమం కోసం ఆత్మ కమిటీలు ఏర్పాటుచేయనుంది. వ్యవసాయరంగ అభివృద్ధితో పాటు రైతుల ఆర్థికాభివృద్ధి చెందేందుకు ఈ కమిటీ ప్రణాళికలు రూపొందిస్తుంది. మార్కెటింగ్, సాంకేతికాభివృద్ధి, ఉత్పత్తులను పెంచడం, వ్యవసాయ ఉత్పత్తులకు మరింత ఊతమిచ్చేలా ఈ కమిటీలు విధివిధానాల్లో పాల్గొంటాయి. వీటి ద్వారా రైతులను బలోపేతం చేస్తూ వారికి అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తరువాత రైతులకు సహాయ సహకరంగా ఉంటూ వారి ఇబ్బందులను, సమస్యలను పరిష్కరిస్తూ ఈ కమిటీలు ముందుకు సాగుతాయి. సీజన్ ప్రారంభం నాటి నుంచి వ్యవసాయ దిగుబడుల వచ్చి మార్కెటింగ్ అయ్యే వరకు ఈ కమిటీలు పనిచేస్తాయి. ఆత్మ అనే సంస్థ ఇతర విభాగాల సహకారంతో కమిటీలను బలోపేతం చేసి ఆ కమిటీలకు కీలక బాధ్యతలను అప్పగిస్తారు. ప్రతి కమిటీలో 30మంది సభ్యులు ఉండగా అందులో 25మంది రైతులే ఉంటుండటంతో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పరిష్కరించుకునేందుకు రైతులకువీలుంటుందనేది ప్రభుత్వ

మిగతా 7వ పేజీలో...

రోజువారీ కార్యకలాపాల పరిశీలన

ఆత్మ కమిటీలు వ్యవసాయరంగానికి సంబంధించిన కార్యకలాపాలను రోజువారీగా పరిశీలించడంతో పాటు ప్రణాళికలను అమలు చేస్తుంది. బ్లాక్, జిల్లా స్థాయిలో రైతు సలహా కమిటీలు అంటే ఆత్మ కమిటీలు ఏర్పడుతాయి. బ్లాక్ ఫార్మర్స్ సలహా కమిటీలు ఏర్పాటు చేసిన తరువాత రైతులకు ఈ కమిటీలు ఉపయోగపడుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కమిటీల్లో ఆదర్శ రైతులతో పాటు అవార్డు గ్రహీతలైన రైతులు, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో శిక్షణ పొందిన రైతులను ఈ కమిటీల్లో నామినేట్ చేస్తారు. ఈ కమిటీల్లో మూడింట ఒకరు మహిళ రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం కల్పిస్తారు. ఈ కమిటీలు రెండు సంవత్సరాల పాటు పనిచేస్తాయి. ప్రతీ మూడు నెలలకొకసారి కమిటీలు వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించడంతో పాటు రైతులతో సమావేశాలు నిర్వహిస్తాయి. జిల్లా స్థాయిలో ఏర్పడే కమిటీలో 40మంది సభ్యులను నియమిస్తారు. వ్యవసాయ, అనుబంధరంగాల నుంచి సంబంధిత విభాగాల్లో అనుభవజ్ఞులైన వారిని జిల్లా కమిటీతో పాటు రాష్ట్ర కమిటీకి నామినేట్ చేస్తారు.

రైతులు నూతన పద్ధతులను పాటించాలి



యాద్గార్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మిర్యాలగూడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో నూతన శాస్త్రీయ సాంకేతిక పద్ధతులను పాటించాలని కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 'ప్రయోగశాల నుంచి భూమికి' అనే నినాదంతో గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి, కొత్తపేట గ్రామాల్లో 'రైతుల ముంగిటకు శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు వానాకాలంలో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, భూసార పరీక్షలు, డ్రోన్ వినియోగం, నేరుగా విత్తే పద్ధతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పట్టు విభాగ శాస్త్రవేత్త టి.మాధురి మాట్లాడుతూ, రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పట్టుపరిశ్రమపై కూడా మొగ్గు చూపాలన్నారు. శాస్త్రవేత్తలు జీఆర్.రామకృష్ణమూర్తి, బి.నిర్మల మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరితోపాటు కూరగాయల సాగు, పండ్ల మొక్కల పెంపకం, పెరటికోళ్లు, పశువులు, చేపల పెంపకం ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తక్కువ ఖర్చుతో లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త యామిని, ఏఈవోలు రమేష్, హిమబిందు, సైదులు, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, మహబూబ్‌అలీ, ఎల్లయ్య, రంగయ్య, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రపంచస్థాయి విద్య అందిచాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసిందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. గురువారం, ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు త్వరలో టెండర్లు పిలిచి భవన నిర్మాణ పనులను కొల్‌ముంతలపహాడ్‌లో 25 ఎకరాల్లో చేపడతామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో రూ.50కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గానికి మిషన్‌భగీరథ ద్వారా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.140కోట్లతో ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి 132/33కేవీ, 33/11కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని 200 పడకలుగా మారుస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోందన్నారు. నేరేడుగొమ్ము మండలంలో చేపట్టిన అంబ భవాని ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు జూన్ నాటికి పూర్తవుతాయన్నారు. ఏకేబీఆర్ ఎత్తిపోతల నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, ఆలంపల్లి నర్సింహ, ఎం.సిరాజ్‌ఖాన్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, మారేపాకల సురేష్‌గౌడ్, పున్న వెంకటేశ్వర్లు, రమావత్ తుల్సానాయక్, రాంసింగ్, ఏర్పుల గోవిందు, శిరందాసు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఉడుతలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు రూరల్, మర్రిగూడ, నాంపల్లి, నల్లగొండ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉడుతలపల్లి, మర్రిగూడ మండలంలోని కొట్టాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఉడుతపల్లిలో 65 మందికి ఇళ్లు మంజూరు కాగా, 18 మంది నిర్మాణ పనులు ప్రారంభించగా, 11 మంది పునాది పనులు పూర్తిచేశారని, వారిలో ఇద్దరికి రూ.లక్ష చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేశామని కలెక్టర్‌కు ఎంపీడీవో యాదగిరి వివరించారు. కొట్టాలలో 11మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేపట్టారని కలెక్టర్‌కు ఎంపీడీవో మున్నయ్య వివరించారు. దీంతో కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున మిగిలిన లబ్ధిదారులు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి అవకతవకలను సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్లు కిరణ్మయి, శ్రీనివాస్, మర్రిగూడ మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీవో రవికుమార్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, నాయకులు ఏర్పుల శ్రీశైలం, కొట్టం కవిత యాదయ్య, లింగారెడ్డి పాల్గొన్నారు.

భవిత కేంద్రం పనులు వేగవంతం చేయాలి

మానసిక దివ్యాంగుల కోసం రీహాబిలిటేషన్ సెంటర్ భవిత కేంద్రం నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నాంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రం పనులను ఆమె తనిఖీ చేశారు. భవిత కేంద్రాల్లో ర్యాంప్, టాయిలెట్స్, యాక్టివిటీ రూమ్, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మర్రిగూడ జిల్లా పరిషత్ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసేందుకు హౌసింగ్ ఏఈతో చర్చించి ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్లు శ్రీనివాస్, దేవ్‌సింగ్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో 22 భవిత కేంద్రాలకు సివిల్ పనులు ప్రారంభించేందుకు అడ్వాన్సు సైతం మంజూరైందన్నారు. ఎంఎస్‌వోలు, ఐఆర్పీలు వ్యక్తిగత శ్రద్ధ వహించి పనులు పూర్తి చేయాలన్నారు. కేంద్రాన్ని పరికరాలతో పాటు, రంగులతో తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవిత కేంద్రాల్లో వినియోగించనున్న సామగ్రి, ఆట వస్తువులు, కుర్చీలు, బొమ్మలు, టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, నల్లగొండ, దేవరకొండ ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, డీఈవో భిక్షపతి, మండల ప్రత్యేక అధికారులు, ఎంఈవోలు, ఐఆర్పీలు పాల్గొన్నారు.

నేడు మంత్రుల సమీక్షా సమావేశం

నల్లగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి ధాన్యం సేకరణ, వ్యవసాయం, రుతుపవనాలు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి తదితర అంశాలను సమీక్షిస్తారని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నకిలీ విత్తన విక్రయాలపై నిరంతర నిఘా

జేడీఏ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని, పోలీస్‌శాఖ సమన్వయంతో నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్టు జేడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక రైతువేదికలో ఎరువుల డీలర్లతో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ఎరువుల విక్రయాలు సాగించాలని, విత్తన డీలర్లు సైతం నాణ్యమైన, మేలిరకం విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురుగుమందుల విక్రయాల్లో మోసాలకు పాల్పడితే లైసెన్స్ రద్దుచేసి కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన డీలర్లనుంచి విధిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఎరువుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సాంకేతిక పరమైన మార్పులు అందుబాట్లోకి వస్తున్నట్లు తెలిపారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించబోమన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 70వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా, అందులో యూరియా 30వేల మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 28వేల మెట్రిక్‌టన్నులు, డీఏపీ 4వేల మెట్రిక్‌టన్నులు, పొటాష్ 2వేల మెట్రిక్‌టన్నుల మేర నిల్వలు ఉంచామన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఎరువులను దిగుమతి చేసుకొని రైతులకు సరిపడా అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. గత వానాకాలం సీజన్‌లో జిల్లా రైతాంగం సుమారు 70వేల మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగించడం జరిగిందని, అదేస్థాయిలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, ఏవోలు రుషేంద్రమణి, సరిత, శివరామ్‌కుమార్, కిషోర్‌నాయక్, ఏఈవోలు నితీన్, షఫీ, శ్రీకాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలి

మాడ్గులపల్లి: రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని జేడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ షాపును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో శివరాంప్రసాద్, వల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని పోషిస్తున్న బీజేపీ

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించడమే తప్ప ప్రజల సమస్యలు బీజేపీ ప్రభుత్వానికి పట్టవని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సింగారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం రంగారెడ్డి-పాలమూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా, ఆంధ్రాలో కొత్త భనకచర్ల ప్రాజెక్టు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయడం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం సహకరించడం లేదని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గం కమ్యూనిస్టు కార్యకర్తలు అసమాన త్యాగాలతో ముందుకువెళ్తున్నారన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ మారుతున్న పరిస్థితి ఉందన్నారు. కానీ, ఎర్రజెండాను పట్టిన ప్రతీ నిరుపేద కార్యకర్తలు పార్టీలు మారకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిజాయితీగా పనిచేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవాలన్నారు. తొలుత అమరజీవి జినుకుంట్ల సాయిలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సమావేశం మండల కార్యవర్గ సభ్యుడు ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగిన నాయకులు కురుమిద్ది శ్రీనివాసులు, గురుజ రామచంద్రం, బులుగురి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, సురిగి చలపతి, బొమ్మర గోని లాలయ్య, చాపల శ్రీను, గోస్కొండ లింగయ్య, మందుల పాండు, బండమీది యాదయ్య, దుబ్బ వెంకన్న, ఈదులకంటి కైలాస్, వనం వెంకన్న, ఎండి.జానీ, బులుగూరి వంశీకృష్ణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు: సీఐ నర్సింహులు

దేవరకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలంలోని తాటికోలు, మైనంపల్లి, ముదిగొండ, కర్నాటిపల్లి వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నర్సింహులు హెచ్చరించారు. దేవరకొండలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాటికోలు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వాగుల వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సబ్సిడీలో జీలుగ, జనుము విత్తనాలు

చింతపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సొసైటీలో సబ్సిడీపై పచ్చిరొట్ట, జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో శ్రవణకుమారి గురువారం తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్ పత్రాలను అందించి విత్తనాలను పొందవచ్చని అన్నారు. జీలుగ 30కిలోలకు 2137, జనుము 40 కేజీలకు 2055 ధరలకు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

తెరుచుకునేనా..?

- గతేడాది 116 పాఠశాలల మూసివేత
- ఈ విద్యా సంవత్సరమైనా ప్రారంభమయ్యేనా?
- ప్రారంభించాలని గిరిజనుల వేడుకోలు
- పాఠశాలలు మూసివేయడంపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

దేవరకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అంతేకాక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం చేపట్టింది. కానీ దేవరకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి నిధులు కేటాయిస్తుంది. డిజిటల్ తరగతులు ఏర్పాటు చేసి మెరుగైన విద్యాబోధన అందించేందుకు అన్ని చర్యలు చేపడుతుంది. దేవరకొండ నియోజకవర్గం గిరిజన ప్రాంతం. గిరిజనులు అధికమొత్తంలో ఉండటంతో పాఠశాలలు మూతపడుతుండటంతో విద్యార్థులు విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ పాఠశాలలను చేరే పరిస్థితి నెలకొంది. పిల్లలకు తమ దుస్థితి రాకూడదని విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు చదువు చెప్పించాలని ఉద్దేశ్యంతో డబ్బులు ఖర్చుచేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలోనైనా నియోజకవర్గంలో మూతపబడిన ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకుంటాయన్న ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.


చందంపేట మండలంలో మూతపడిన అచ్చంపేటపట్టి ప్రభుత్వ పాఠశాల

మూతపడిన 116 ప్రభుత్వ పాఠశాలలు

గత విద్యాసంవత్సరం దేవరకొండ నియోజకవర్గంలో 116 ప్రభుత్వ పాఠశాలలు వివిధ కారణాలతో మూతపడ్డాయి. దీంతో విధిలేని పరిస్థితిలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే పరిస్థితి ఏర్పడింది. అందుకు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. డివిజన్ పరిధిలో దేవరకొండలో 6, చందంపేటలో 36, నేరేడుగొమ్ములో 15, కొండమల్లేపల్లిలో 13, చింతపల్లి 11, డిండి 17, గుడిపల్లి 4, పీఏపల్లి మండలంలో 14మొత్తం నియోజకవర్గంలో 116 ప్రభుత్వ పా ఠశాలలు మూతపడ్డాయి. లక్షల రూపాయలు ఖర్చుచేసి ప్ర భుత్వం పాఠశాలల భవనాలు ఏర్పాటు చేస్తే పాఠశాలలు మూతపడటంతో పాఠశాలల భవనాలు నిరుపయోగంగా మారాయి. అందుకు కారణం ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులు సరిపడా లేకపోవడమే కారణమని పలువురు పేర్కొంటున్నారు. ఈ విద్యాసంవత్సరంలోనైనా ఎస్టీ నియోజకవర్గమైన దేవరకొండ నియోజకవర్గంలోని మూతపడిన పాఠశాలలను తెరిపించి అక్కడి విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తుందని ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలను తెరిపించాలి



దేవరకొండ నియోజకవర్గంలోని 116 ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడంతో విద్యార్థులు విద్యకు దూరమయ్యారు. పాఠశాలల మూసివేయడంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పాఠశాలలను ఓపెన్ చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాను. గిరిజనతండాలు, గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు అధికారుల నిర్లక్ష్యం వల్లే మూతపడ్డాయి. ఈ విద్యాసంవత్సరంలోనైనా నియోజకవర్గంలో మూసివేసిన పాఠశాలలు తెరిచి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి.

\- కేతావత్ లాలునాయక్,
బీజేపీ రాష్ట్ర నాయకుడు

విద్యుత్ సమస్యకు పరిష్కారం

- నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- ఎమ్మెల్యేకు గ్రామస్థుల కృతజ్ఞతలు

చందంపేట, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్‌దేవరపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే ఎమ్మెల్యే బాలునాయక్ పరిష్కరించినట్లు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ తెలిపారు. తెల్‌దేవరపల్లి గ్రామంలో 25 విద్యుత్ స్తంభాలు, డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు, పాక్షికంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లను తొలగించి నూతన వైర్లను మంజూరు చేసినందుకు తెల్‌దేవరపల్లి గ్రామస్థుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్, లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సమాచారం

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

కొండమల్లేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో గల సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, అభిషేక మహోత్సవ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, బొడిగె శంకర్‌గౌడ్, బుడిగ వెంకటయ్య, బూడిద మల్లేష్, ధనుంజయ, బోడ యాదగిరి, రాంబాబు, పరమేష్, ఆలయ పూజారులు పాల గణపతి శర్మ, సదాశివశర్మ, జయప్రకాశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పుస్తకంగా మన సినిమా ఫస్ట్ రీల్ బుక్


నివేదిక అందజేస్తున్న జ్యూరీ సభ్యులు వాకిటి మధు, భగీరథ, కనకదుర్గ

మిర్యాలగూడ టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డ్స్‌కు ఉత్తమ పుస్తకంగా మన సినిమా ఫస్ట్ రీల్ బుక్‌ను ఎంపిక చేసినట్లు జ్యూరీ సభ్యులు, పట్టణ వాసి వాకిటి మధు తెలిపారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పోటీకి 7 పుస్తకాలు రాగా రెంటాల జయదేవ రాసిన మన సినిమా ఫస్ట్ రీల్ బుక్‌ను ఎంపికైనట్లు తెలిపారు. ఎంపిక చేసిన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జ్యూరీ మెంబర్లు భగీరథ, డాక్టర్ వడ్డమాని కనకదుర్గ, సినీ నిర్మాత దిల్ రాజు తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి అధికారుల పరామర్శ

తిరుమలగిరి(సాగర్), మే 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు వేముల శ్రీను కుటుంబ సభ్యులను పలువురు అధికారులు పరామర్శించారు. అనుముల మండలంలోని కొత్తపల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం గురువారం అల్వాల గ్రామానికి మృతదేహాన్ని తీసుకురాగా ఉపాధి హామీ పథకం క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎంపీడీవో మల్లేశ్వర్‌తో కలిసి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించాడు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ అవసరంగా రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వపరంగా శ్రీను కుటుంబానికి న్యాయం చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని అధికారులు పేర్కొన్నారు. అకాల మృతిచెందిన శ్రీనుకు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల నాయకులు సంతాపం తెలిపారు. వారి వెంట ఎంపీవో భిక్షంరాజు, ఏపీవో శ్రీను, ఈసీ శ్రీరాములు, టీఏలు జ్యోతి, చంద్రశేఖర్, కార్తీక్‌రెడ్డి, బాలాజీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలను అక్కున చేర్చుకుంటున్న కేంద్రం

మిర్యాలగూడ టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అన్నదాతలను అక్కున చేర్చుకుంటోందని బీజేపీ పారిశ్రామిక సెల్ జిల్లా కన్వీనర్ తల్లం అశోక్ అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పంట ధాన్యాల మద్దతు రేట్లు పెంచడం హర్షనీయమన్నారు. పంటల బీమా నుంచి ధాన్యం కొనుగోళ్ల వరకూ ప్రతీ అంశంపై ప్రత్యేక దృష్టి సారించడం గొప్ప విషయమన్నారు. దేశంలో పంట భూముల ధరలు పెరుగుతున్నాయన్నారు. బీజేపీ పాలనలో కార్మిక, కర్షకులు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే బాలునాయక్



చింతపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షే మ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. చింతపల్లి మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల కోసం అభ్యర్థుల కోసం ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతి సౌకర్యాల కల్పన కోసం నిరంతం రం కృషి చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు దొంతం సంజీవరెడ్డి, ఎరుకుల వెంకటయ్యగౌడ్, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌పై చర్యలు తీసుకోవాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

దేవరకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ల సమయపాలనపై వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్న డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు జర్నలిస్టులు కోరారు. దేవరకొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు గురువారం ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు సమయపాలన పాటించడం లేదని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని వార్తలు రాసిన జర్నలిస్టుపై డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్ కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. డాక్టర్లు సమయ పాలన పాటించకుండా సొంత ఆసుపత్రులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కేసులు పెడుతామని జర్నలిస్టులను బెదిరిస్తున్నారని తెలిపారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో దేవరకొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వైఎస్ కర్ణాకర్, జర్నలిస్టులు అంజన్, ఫయాజ్, ఇలియాజ్, చారి, దర్శనం విష్ణు, కొమ్మినేని అంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాలలను సిద్ధం చేయాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆప్ నాయకులు

మిర్యాలగూడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యం లో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని ఆప్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. కు త్బుద్దీన్ డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఎంఈవో బాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని, శానిటరీ సిబ్బందిని నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని, తరగతి గదులను శుభ్రం చేయాలని అన్నారు. పుస్తకాలు, దుస్తులు సకాలంలో అందించేలా ఏర్పాటు చేయాలని, క్రీడా మైదానాలు అభివృద్ధి చేసి సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. ప్రైవేటు పాఠశాలలపై పర్యవేక్షణ ఉంచాలని, ఫీజులను నియంత్రించే చర్యలకు ఉపక్రమించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు కీర్తి అశోక్. బెజవాడ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాలగూడ మునిసిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో రెస్క్యూ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డుల వారీగా జవాన్లు, వార్డు ఆఫీసర్లను జత చేసి 14 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. వర్షాకాలంలో రేయింబగళ్లు అందుబాటులో ఉండేలా అత్యవసర సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వన్ టౌన్, టూటౌన్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వన్ టౌన్ కంట్రోల్ రూం. 9581263464, టూటౌన్ కంట్రోల్ రూం నెంబరు 9666290488 అందుబాటులో ఉంటాయన్నారు. అంతేకాక పట్టణంలో వరద నీరు సాఫీగా ప్రవహించేలా ప్రధాన నాలాలలో పూడిక తీసినట్లు తెలిపారు. సమావేశంలో టీపీఎస్ అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు కమిటీ..

రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు కమిటీలను ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. మెప్మా విభాగం ఆధ్వర్యంలో గురువారం బ్యాంకర్లు, కార్పొరేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో పథకానికి 5097 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాట్లు తెలిపారు. సమావేశంలో కవిత, బక్కయ్య, వీటీ. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేత

మునిసిపల్ కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించాలని కోరుతూ బీజేపీ ధార్మిక సెల్ రాష్ట్ర కోకన్వీనర్ చిలుకూరు శ్యాం కోరారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఆయా ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ యూసుఫ్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

కార్యాచరణ పకడ్బందీగా అమలుచేయాలి : సుదర్శన్

దేవరకొండ: వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలని మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. దేవరకొండ మునిసిపాలిలో గురువారం వార్డు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, మునిసిపల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున దేవరకొండ మునిసిపాలిటీలోని కాలనీల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డుల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏ వార్డులో ఏ సమస్యలు ఉన్నాయో ముందుగా ప్రణాళికలు తయారు చేసి పరిష్కరించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. హరితహారంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, ఏఈ రాజు, పీపీవో శ్రీధర్, వర్షిక, రాకేష్, సక్రునాయక్, జగమంతు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోనులో చిక్కిన 67 కోతులు


బోనులో చిక్కిన కోతులు

దేవరకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో కోతుల బెడద అరికట్టేందుకు మునిసిపల్ అధికారులు పట్టణంలోని 14వ వార్డు, గాంధీనగర్, సంజయ్‌కాలనీలో మూడు బోనులు ఏర్పాటు చేశారు. కోతులను పట్టేవారిని రప్పించారు. గురువారం 14వ వార్డు యూపీఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోనులో 67 కోతులు చిక్కినట్లు మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ తెలిపారు. బోనులో చిక్కిన కోతులను శ్రీశైలం అడవుల్లో వదిలిపెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణంలో కోతులను పట్టే కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

నిడమనూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో రైతులు పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని ఏఈవో దండెం విజయచంద్ర అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై గురువారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాగుకు విత్తన ఎంపిక ఎంతో ప్రధానమని, మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకొని సాగు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వానాకాలం సీజన్‌లో కాల్వలకు నీటిని విడుదల చేయని పక్షంలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుము సాగు చేస్తే నేలలో భూసారం పెరగడంతో పాటు నీటి ఆదా అవుతుందని అన్నారు. పట్టా కలిగి ఉన్న ప్రతీ రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. దీంతో రైతులకు కేంద్రప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి రైతులు పంటలు సాగు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఇంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

కొండమల్లేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని చెన్నమనేనిపల్లిలో గురువారం నిర్వహించిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో అసమానతలు లేని, దోపిడీ లేని వ్యవస్థ సీపీఐతోనే సాధ్యమవుతుందని అన్నారు. సమాజంలో అసమానతలు విపరీతంగా పెరిగి ధనికులు మరింత ధనికులుగా, పేద వాళ్లు మరింత పేద వాళ్లుగా మారుతున్నారని అన్నారు. గత ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అన్నారు. ఈ మహాసభలో సీపీఐ నాయకులు పల్లా దేవేందర్ రెడ్డి, గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, పెరికేటి శేఖరాచారి, నూనె రామస్వామి, యాద ఆంజనేయులు, పన్నాల శ్రీనివాస్, పోమ్లానాయక్, సత్యనారాయణ, వీరస్వామి, ధర్మయ్య, చరణ్‌రెడ్డి, వెంకటయ్య, భిక్షం పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు

- ఎస్ఐ సంపత్

నాగార్జునసాగర్, మే 29(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పరిధిలో ఉన్న విత్తనాల దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సాగర్ ఎస్ఐ సంపత్ హెచ్చరించారు. వానాకాలం ప్రారంభ కావడంతో సాగర్ చుట్టుపక్కల ఉన్న కృష్ణపట్టె తండాల గిరిజన రైతులతో పాటు, గ్రామాల రైతులు సాగర్‌కు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నాగార్జునసాగర్‌లో ఉన్న విత్తనల విక్రయ, దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను, విత్తనాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట సిబ్బంది సతీష్ ఉన్నాడు.


దుకాణ యజమానులతో మాట్లాడుతున్న ఎస్ఐ సంపత్

సినిమా గైడ్

మిర్యాలగూడ

శ్రీనివాస	: సింగిల్
వెంకటేశ్వర	: మిషన్ ఇంపాసిబుల్
రాఘవ	: హిట్ 3
విట్రోస్	: హిట్ 3 , ఫైనల్ డిస్టినేషన్, బ్లడీనెస్, ఎలెవన్

దేవరకొండ

మనోజ్	: మిషన్ ఇంపాసిబుల్, ఫైనల్ రాకింగ్
మైత్రి వెంకటేశ్వర	: యమదొంగ, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్